నవతెలంగాణ
1
ఆదిలాబాద్
ఆదివారం | అక్టోబర్ 08, 2023 | www.navatelangana.com

డిగ్రీ విద్యార్థులకు అవగాహనా సదస్సు

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వినియోగదారుల హక్కుల అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జలగం అనిత అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య ముఖ్య బాధ్యులు శంకర్ లాల్ చౌరాసియా, సంపత్ కుమార్, శివ పార్వతి, వినియోగదారుల సంఘం అధ్యక్షులు మోహన్, ఉపాధ్యక్షులు ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏ విధమైన మోసాలకు గురికాకుండా ఉండడానికి వినియోగదారి హక్కులు, చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కన్స్యూమర్ క్లబ్ కో-ఆర్డినేటర్ కె.చంద్రకాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-కాసిపేట

సోమగూడెం వద్ద అక్రమంగా ఐచర్ మినీ వ్యాన్‌లో తరలిస్తున్న 25క్వింటళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం..మేరకు రెబ్బెన నారాయణపూర్‌కు చెందిన రేను కృష్ణకుమార్, దేవాపూర్‌కు చెందిన తంగేడిపల్లి అరవింద్ దేవాపూర్ ప్రాంతంలో ప్రజలను. మోసం చేస్తూ వారి వద్ద నుంచి పది రూపాయాలకు కిలో చొప్పున రేషన్ బియ్యం కొనుగోలు చేశారు. కృష్ణ కుమార్ సాయంతో అతని ఐచర్ మినీ వ్యాన్‌లో మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు. వాహనం, రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని, నేరస్తుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.



రిలే నిరాహారదీక్షలు ప్రారంభించిన ఆశాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వం ఇచ్చే అన్ని రకాల కార్యక్రమాలతోపాటు పేద ప్రజలకు, బాలింతలకు నిత్యం సేవలందిస్తూ వారి సంక్షేమానికి పాటుపడుతున్న ఆశా వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు బండి దత్తాత్రి అన్నారు. కలెక్టరేట్ ఎదుట ఆశాలు సమ్మెలో భాగంగా శనివారం 13వ రోజు రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారు. బండి దత్తాత్రి ఈ దీక్షలను ప్రారంభించారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఫిక్స్ వేతనం రూ.18000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశాలు 13 రోజులుగా రోడ్లపైకి వచ్చి సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం



నవతెలంగాణ - కాసిపేట

మండల కేంద్రంలో ఇటీవల వివిధ ఉద్యోగాలు పొందిన యువకులకు మండల కాంగ్రెస్ పార్టీ, సీనియర్ క్రీడాకారుల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఇటీవల విడుదలైన వివిధ ఉద్యోగ ఫలితాలలో మంచి ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు పొందిన ముత్యంపల్లికి చెందిన పొలావేణి సంతోష్, సండ్రల్ పహాడ్‌వాసి వంశీ, ముత్యంపల్లి గ్రామవాసి లాక్కుకుల ఆశిష్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు గోలేటి స్వామి, ముత్యంపల్లి టౌన్ అధ్యక్షులు మైదం రమేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు జాడి శివ, వేల్పుల వెంకటేష్, సీనియర్ నాయకులు ముదరకోళ్ల జంపయ్య, పోలీసు ఉద్యోగి పెట్టాం సునీల్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఆకుల రాజేష్, మారం శంకర్, న్యాయవాది రాజన్న, సాయి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-బోథ్

ఉమ్మడి అదిలాబాద్ జిల్లాను కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని టీజీవీపీ నాయకులు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా శనివారం బస్టాండ్ సమీపంలో దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ జిల్లాగా ఉన్న కుమురం భీంలో ఇప్పటి వరకు గిరిజన యూనివర్సిటి కేటాయించలేదన్నారు. దీంతో గిరిజన విద్యార్థులు ఎంతో నష్టపోతున్నారన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూనివర్సిటీకి సౌకర్యాలు పుష్కలంగా ఉన్నయని, ఉట్నూర్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ నాయకుల వైఫల్యం వల్లనే యూనివర్సిటీ వేరే జిల్లాకు వెళ్లిందన్నారు. యూనివర్సిటీని సాధించే వరకు పోరాటాలు ఆపేది లేదనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు అవునూరి శ్రీనివాస్, పసుపుల సంతోష్, బోథ్ పట్టణ అధ్యక్షులు శివరాజ్, రాజు, వినయ్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలు, క్రీడా కిట్లు పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని చించుఘాట్, జందాపూర్ గ్రామాల్లో క్రీడకిట్లు, బతుకమ్మ చీరలు పంపిణీ చేశారు. శనివారం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ శ్యామ్‌రావు లబ్దిదారులు, యువకులకు వాటిని అందించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ పరమేశ్వర్, జందాపూర్ ఉప సర్పంచ్ దేవదాస్, రాజు పటేల్ పాల్గొన్నారు. అదే విధంగా మండలంలోని కచకంటీ గ్రామంలో శనివారం క్రీడకిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యమంలో సర్పంచ్ కుర్ర లక్ష్మి శ్రీనివాస్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అమిత్‌షా జనగర్జన సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్‌లో 10న జరిగే కేంద్ర హోం మంత్రి జనగర్జన సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గజ్జుల ప్రేమేందర్, ఎంపీ సోయం బాపురావ్ అన్నారు. శనివారం బీజేపీ జిల్లా ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. దీని వారు ముఖ్య అతిథులుగా హాజరై సభ విజయంతంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పథకాలు పార్టీకి వెన్నుముక లాంటివని, వాటిని పల్లెపల్లెకు చేర్చాల్సిన బాధ్యత కార్యకర్తలందరిదన్నారు. 10న ఆదిలాబాద్‌లో జరిగే జనగర్జన సభను కార్యకర్తలు విజవంతం చేయాలన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు బీజేపీపై చేస్తున్న ప్రచారాలను తరిమికొట్టే సమయం ఆసన్నమైందన్నారు. పాలమూరు, నిజామాబాద్‌లో జరిగిన సభతో ఇప్పటికే అయోమయంలో పార్టీలున్నాయని, దానికి మించి ఆదిలాబాద్ సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సభ స్థలాంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్, నాయకులు విజయ బోయర్, మయూర్‌చంద్ర, లాలా మున్న, అంకత్ రమేష్, వేదవ్యాస్, ఆదినాథ్, ఆకుల ప్రవీణ్, జోగు రవి, లోకా ప్రవీణ్ రెడ్డి, చిలుకూరు జ్యోతి రెడ్డి, పద్మ సంతోష్ పాల్గొన్నారు.

యంత్రాంగం అలర్ట్..!

- ఇప్పటికే రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది నియామకం
- జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు
- ఎన్నికల నిర్వహణకు సర్వం సన్నద్ధం
- సమాయత్తమవుతున్న రాజకీయ పార్టీలు

సార్వత్రిక ఎన్నికలకు అధికార యంత్రాంగం అప్రమత్తమవుతోంది. ఇప్పటికే నిర్వహణకు సంబంధించి అధికారులు, సిబ్బంది నియామకం పూర్తిచేసిన అధికారులు మిగిలిన వాటిని పూర్తిచేసేందుకు నిమగ్నమయ్యారు. ఏ క్షణంలోనేనా ఎన్నికల ప్రకటన వెలువడే అవకాశం ఉంటుందనే ప్రచారంతో అధికార యంత్రాంగం ముందస్తుగా సంసిద్ధమవుతోంది. జిల్లా నలుమూలల చెక్‌పోస్టులు ఏర్పాటుచేసిన అధికారులు ముమ్మర తనిఖీలు ప్రారంభించారు. ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలో పర్యటించడంతో త్వరలోనే ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం కనిపిస్తోంది.దీంతో ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఆయా శాఖల అధికారులతో సమావేశమవుతూ ఎన్నికల్లో విధుల్లో భాగస్వామ్యం చేస్తున్నారు. ఎన్నికల నియామవళిపై అవగాహన కల్పిస్తూ సంసిద్ధులను చేస్తున్నారు. ఇప్పటికే ఓటరు తుది జాబితా కూడా విడుదల కావడంతో ఇక ఎన్నికలు నిర్వహించడమే తరువాయిగా మారింది. మరోపక్క ఆయా రాజకీయ పార్టీలు సైతం ఎన్నికల పోరులో నిలిచేందుకు సమాయత్తమవుతున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో సార్వత్రిక ఎన్నికల వాతావరణం వచ్చినట్లు కనిపిస్తోంది. ఏ క్షణంలోనైనా ఎన్నికల కోడ్ కూసే అవకాశం ఉందనే ప్రచారంతో ఇటు అధికార యంత్రాంగంతో పాటు అటు రాజకీయ పార్టీలు అప్రమత్తమయ్యాయి. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల ఆశావహులు, నాయకులు రాష్ట్రంలో సుడిగాలి పర్యటనలు చేస్తుండగా.. మరోపక్క ఎన్నికలు నిర్వహించాల్సిన అధికారులు వారి పనిని వేగవంతం చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ కేంద్రాల గుర్తింపు, రిటర్నింగ్ అధికారుల నియామకాన్ని పూర్తిచేశారు. ఎన్నికల విధుల కోసం జిల్లాలోని ఉద్యోగల వివరాలను సైతం సేకరించి క్రోడీకరించారు. వీటితో పాటు ఓటరు తుది జాబితా విడుదల చేసిన ఎన్నికల సంఘం ఆయా రాజకీయ పార్టీలకు ముసాయిదాను అందించింది. ఉన్నతాధికారులు రోజువారీగా ఎన్నికల విధులు, నిర్వహణపైనే సమీక్షలు చేస్తూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు.

సరిహద్దుల్లో చెక్‌పోస్టులు..!

ఎన్నికల్లో అక్రమ మద్యం, డబ్బుల సరఫరాను అరికట్టేందుకు ఇప్పటికే పోలీసు యంత్రాంగం జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటుచేసింది. అక్కడ పోలీసులతో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తోంది. ఆదిలాబాద్ జిల్లా మహారాష్ట్ర సరిహద్దున ఉండటంతో అక్కడి నుంచి అక్రమ మద్యం ఇతర నిషేదిత వస్తువులు సరఫరా కాకుండా నిరంతరం నిఘా ఉంచుతున్నారు. జిల్లాలోని శంకర్‌గూడ, ఆనంద్‌పూర్, పిప్పర్‌వాడ, కరంజీ, లక్ష్మీపూర్, ఘన్‌పూర్‌తో పాటు ఆసిఫాబాద్ జిల్లాలోని మేడిగూడ వద్ద పోలీసులు చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి నిఘా పెట్టారు.



తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్(ఫైల్)

రాజకీయ పార్టీలు సమాయత్తం..!

ఓ వైపు అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణలో నిమగ్నమై ఉండగా మరోవైపు రాజకీయ పార్టీలు సైతం అదే ఊపులో కనిపిస్తున్నాయి. ఇప్పటికే అధికార బీఆర్ఎస్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించగా.. కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలు అభ్యర్థుల జాబితాను సిద్ధం చేస్తున్నాయి. అతి త్వరలోనే ఈ ప్రధాన పార్టీలు సైతం అభ్యర్థుల జాబితాను విడుదల చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీ అభ్యర్థులు ఎన్నికల కోడ్ కంటే ముందుగానే ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేయగా.. ప్రతిపక్ష పార్టీలు వివిధ రకాల తాయిలాలు ప్రకటిస్తూ ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నాయి. ఆయా పార్టీల తరపున బరిలో నిలిచే ఆశావహులు టికెట్ల కోసం ఆయా పార్టీల అధిష్టానాల వద్ద తీవ్ర ప్రయత్నాలు చేస్తుండటం ఆసక్తి రేపుతోంది. మరోపక్క ఇప్పటికే అధికార, ప్రతిపక్ష పార్టీ నాయకుల మధ్య మాటల యుద్ధం ప్రారంభం కావడం రాజకీయాలను మరింత వేడెక్కిస్తున్నాయి.

గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఏజెన్సీలో గిరిజనులతో కలిసి నివాసముంటున్న గిరిజనేతరుల సమస్యలు పరిష్కరించాలని గిరిజనేతర సంఘం జిల్లా అధ్యక్షులు జాడే నాగోరావ్ డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనేతరుల సమస్యలపై శనివారం హెచ్ కెజీఎన్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా ఏజెన్సీలో గిరిజనేతరులు నివాసం ఉంటున్నారన్నారు. అయితే ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలకు దూరంగా ఉంటున్నారని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారే తప్ప గిరిజనేతరుల సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. 1970 కంటే ముందు నుంచి ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనేతర రైతులకు పహాణిలు అందించి, రుణమాఫీ, రైతుబంధు, గృహలక్ష్మి వంటి పథకాలు మంజూరు చేసి అన్ని ప్రభుత్వ పథకాలలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి దశల వారిగా ఉద్యమాలకు కార్యాచరణ రూపొందిస్తున్నామని, ఇందులో భాగంగా త్వరలోనే పాదయాత్ర చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా రమేష్, ఉపాధ్యక్షులుగా సయ్యద్ రషీద్, సింగరే భరత్, ప్రధాన కార్యదర్శిగా సోఫియాన్, జాయింట్ సెక్రటరీగా కేంద్రే రమేష్, ప్రచార కార్యదర్శిగా భరత్, కోశాధికారిగా ఠాగూర్ గోపాల్ సింగ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గిరినేతరుల సంఘ నాయకులు శేఖర్, నర్సయ్య, యునుస్ అక్బాని, ఫయాస్, మాసూద్, కాంబ్లె ప్రజ్ఞశీల్, కాటం రమేష్, నర్సింగ్ మోర్, లింగంపల్లి చంద్రయ్య, జైనొద్దీన్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలి

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట 13 రోజులుగా సమ్మె చేస్తున్న ఆశా కార్యకర్తలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు వారాలుగా ఆశా కార్యకర్తలు సమ్మె చేస్తున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. కనీస వేతనం రూ.18వేలు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితులలో కుటుంబాన్ని వదిలి ఆశా కార్యకర్తలు సమాజం కోసం చేసిన కృషి మరువలేనిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖాడే ఉత్తం, పట్టణ అధ్యక్షుడు ఎండీ జహీర్, మాజీ సర్పంచ్ మెస్రం నాగనాథ్, జిల్లా నాయకుడు సొన్ కాంబ్లే జీతేందర్, సేవాదళ్ మండల అధ్యక్షుడు చాహకటి మాణిక్‌రావ్, సీనియర్ నాయకులు గాయక్వాడ్ భగవాన్, సోన్ కాంబ్లే ప్రకాష్, సోన్ కాంబ్లే బాబాసాహెబ్, ఆశా కార్యకర్తలు కాంతాబాయి, తులసి, వనమాల, సోను, ఊర్మిళ, రుషాలి, సువర్ణ, అనసూయ, సునీత, గోదావరి, ధృపద పాల్గొన్నారు.

మరోసారి ప్రజలను కోసం చేసేందుకు ఎమ్మెల్యే సిద్ధం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే జోగు రామన్న కొన్ని రోజులుగా తీరిక లేకుండా యుద్ధం చేసిన మాదిరిగా ఎక్కడ పడితే అక్కడ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్టు ప్రజలను కేవలం ఓట్లకోసం మభ్యపెడుతున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. శనివారం సీఆర్ఆర్ నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో చెప్పిన హామీలు రైల్వే బ్రిడ్జి, చనాక-కోర్ట బ్యారేజీ ఇప్పటి వరకు పూర్తి కాలేదన్నారు. మూతబడ్డ సీసీఐ ప్రారంభం చేయకుండా రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ అని చెప్పి దానికి అతీగతి లేకుండా పోయిందన్నారు. తరోడా వంతెన లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నా సోయి లేకుండా తిరుగుతున్నారే తప్ప ప్రజల కష్టాలను పట్టించుకోరని మండిపడ్డారు. కేవలం పట్టణంలో ప్రధాన చౌక్‌లలో మెరుపులు దిద్ది నేత్రానందం పొందుతున్న జోగు రామన్న ఇప్పటికైనా ప్రజాప్రయోజనల మీద దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

ప్యారాషూట్, ఆర్ఎస్ఎస్ వాళ్లకు టికెట్ ఇవ్వొద్దు

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జోగు రామన్న ప్రజలను మభ్య పెడుతూ మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యారని అన్నారు. తమ ముగ్గురిలో టికెట్ ఎవరికిచ్చిన పార్టీ గెలుపుకు కృషి చేస్తామన్నారు. తమ ముగ్గురిని కాదని ప్యారాషూట్, ఆర్ఎస్ఎస్ భావజాలం గల వ్యక్తి కంది శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఇస్తే మాత్రం తాము సపోర్ట్ చేయమని స్పష్టం చేశారు. మైనార్టీలెవరూ ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న వారికి ఓటు వేయరని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పార్టీ జెండా మోసి, పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికి టికెట్ ఇవ్వాలని ఈ సందర్భంగా అధిష్టానాన్ని కోరారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, అంభకంటి అశోక్, వెంకట్‌రెడ్డి, వాసిమ్, సంజయ్, విఠల్ నర్సారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శంకర్, రూపేష్‌రెడ్డి, అమృత్, ప్రవీణ్, ఫెరోజ్, గజానన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుజాత, పక్కన సాజిద్‌ఖాన్, సంజీవ్‌రెడ్డి ఇతర నాయకులు

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో త్వరలో జరగబోయే శాసనసభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ అన్నారు. శనివారం జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, అదనపు ఎస్పీ అచ్చేశ్వరరావు, ఆర్డీఓ సురేష్‌తో కలిసి ఎన్నికల విధులలో వ్యవహరించాల్సిన విధానం గురించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కార్యచరణ విడుదల అయిన తర్వాత ఎన్నికల నియమావళిలో భాగంగా జిల్లాలో పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికలలో భాగంగా ప్రజలను ప్రలోభ పెట్టేందుకు ధనం, మద్యం, కానుకల ప్రభావం లేకుండా పర్యవేక్షించేందుకు విధులు కేటాయించబడిన అధికారులు సక్రమంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ విధులు నిర్వహించే అధికారులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని, ఏవైనా ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి సంబంధిత ప్రాంతాలకు త్వరగా చేరుకోవాలని, చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని పేర్కొన్నారు. అక్రమ మద్యం, నగదు తరలించే అవకాశం ఉన్నందున ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని తెలిపారు. ర్యాలీలు, బహిరంగ సమావేశాల వద్ద వీడియో, ఫొటో చిత్రీకరణ చేసి ఆ సమాచారాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి పంపించాలని, ఎన్నికల నియమావళిలో భాగంగా ఏవైన స్వాధీనం చేసుకునే సమయంలో నిబంధనలు పాటించాలని, ఎవరి ప్రలోభాలకు లొంగకుండా విధులను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. 24 గంటలపాటు బదిలీల వారీగా విధులు నిర్వహించాలని, సి-విజిల్ ద్వారా ఫిర్యాదు అందితే గంట లోపల చేరుకునే విధంగా చర్యలు తీసుకోవాలని, నివేదికలను సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందించాలని తెలిపారు. ర్యాలీలు, బహిరంగ సభల వద్ద రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళిని అతిక్రమించినట్లయితే కేసులు నమోదు చేయాలని, కేటాయించిన విధులలో ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో సెక్టార్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, చెక్ పోస్టుల సిబ్బంది, ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీతో ఆర్థిక పరిపుష్టి సాధించాలి : ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

ఆసిఫాబాద్ : గొర్రెల పంపిణీతో యాదవులు ఆర్థిక పరిపుష్టి సాధించాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. జిల్లా కేంద్రంలో జడ్పీటీసి అరిగెల నాగేశ్వరరావుతో కలిసి తుంపల్లి గ్రామానికి చెందిన 21 మంది, బూరుగూడ గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు గొర్రెల పంపిణీకి సంబంధించిన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవుల ఆర్థిక పరిపుష్టి కోసం ప్రభుత్వం గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపడుతోందన్నారు. సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యాదవుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు వైద్య అధికారి డాక్టర్ సురేష్, మండల పశువైద్య అధికారి డాక్టర్ మురళీకృష్ణ, యాదవ సంఘం అధ్యక్షుడు కుమార్, నాయకులు గంగన్న పాల్గొన్నారు.

కుమురం భీం ఉత్సవ కమిటీ ఎన్నికకు తరలి రావాలి

నవతెలంగాణ-కెరమెరి

జోడేఘాట్‌లో ఆదివారం నిర్వహించి తలపెట్టిన కుమురం భీం ఉత్సవ కమిటీ ఎన్నికకు తరలిరావాలని భీం మనుమడు సోనేరావు అన్నారు. శనివారం జోడేఘాట్‌లో గిరిజన సంఘాల నాయకులతో కలిసి మాట్లాడారు. ఈ నెల 28న భీం వర్థంతి సభను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న నేపథ్యంలో సభ సజావుగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీని ఎన్నుకోనున్నామని తెలిపారు. జిల్లాలోని ఆదివాసి గిరిజనులు, గ్రామ పెద్దలు, విద్యావంతులు సర్మేడిలు, గిరిజన సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, యువకులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవ కమిటీ ఎన్నికను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పెందూరు మోతీరాం, సర్పంచులు తొడసం జగన్నాథరావు, కుమురం జ్ఞానేశ్వర్, నాయకులు భీంరావు, బొజ్జీరావు, కుడ్మెత సోము, లాల్‌షావ్ పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ కోసం కొనసాగుతున్న దీక్షలు

నవతెలంగాణ-బోథ్

రెవిన్యూ డివిజన్ కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తామని సాధన సమితి సభ్యులు అన్నారు. 84 రోజులుగా దీక్ష కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. మూడు నెలలుగా దీక్షలు సాగుతున్న ఈ పోరాటాన్ని గుర్తించకపోవడం స్థానిక ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యానికి నిదర్శంగా భావిస్తున్నామన్నారు. బోథ్ ఆస్తిత్వం ఆత్మగౌరవం కోసం సాగుతున్న ఈ పోరాటం రేపటి నుండి ఉధృతం చేస్తూ విద్యార్థులచే పోస్టు కార్డు ద్వారా దాదాపు 3000 ఉత్తరాలను సీఎం కి పంపించడం జరుగుతుందన్నారు. వారం రోజుల కార్యాచరణలు రూపొందించుకోని నిరసనలు చేపడుతామన్నారు.ఈ కార్యక్రమం లో రెవెన్యూ డివిజన్ సాదన సమితి సభ్యులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలని నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మెగా డీఎస్సీ నిర్వహించాలని, టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ 13వేల ఉపాధ్యాయ ఉద్యోగాలతో నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించి, ఆ మాట కూడా నిలుపుకోకుండా కేవలం 5వేల ఉద్యోగాలతో నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. దీంతో నిరుద్యోగులు నిరాశకు గురయ్యారని తెలిపారు. కనీసం 20వేల ఉద్యోగాలతో నోటిఫికేషన్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ పాఠకుల సంఘం అధ్యక్షుడు సాత్విక్ రెడ్డి, గంగన్న, విద్యాసాగర్, విజయ్, అవినాష్ ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిర్మల్
ఆదివారం అక్టోబర్ 08, 2023 www.navatelangana.com

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ఆర్మీ, నేవి, పోలీస్, వంటి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారని ప్రిన్సిపాల్ కందూరి శంకర్ తెలిపారు. శనివారం ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులను కళాశాల బృందం అభినందించింది. తమ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థుకు, అధ్యాపకులు పూర్వ విద్యార్థులకు ప్రోత్సహాన్ని అందిండంతో పాటు, సలహాలు, సూచనలు చేశారు. దీంతో విద్యార్థులు అధ్యాపకుల సలహాల మేరకు పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు. ఇటీవల వెలువడిన ఆర్మీ, నేవీ, పోలీస్ ఫలితాల్లో కళాశాలకు చెందిన విద్యార్థులు జాదవ్ నితిన్ ఇండియన్ నేవీలో, జాదవ్ సచిన్, అడెపు రాజు ఆర్మీ అగ్నివీర్‌లో, బి.సాయికుమార్ పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగాలు సాధించారు.

ఎస్సీ సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని వటోలి గ్రామ ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు రూ.2లక్షలు మంజూరయ్యాయని జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ లోలం శ్యాంసుందర్ తెలిపారు. శనివారం నిధులు మంజూరు అయిన ప్రొసీడింగ్ కాపీని సంఘ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ రత్నాకర్‌రావు, ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, ఎంపీటీసీ విజయ సాయరెడ్డి, సర్పంచులు, సాయన్న, ఎల్లన్న, దిగాంబర్, బీఆర్‌ఎస్ నాయకులు దగిడే రవి, సతీష్ పాల్గొన్నారు.



ఖానాపూర్ నుంచి హైదరాబాద్‌కు బస్సు నడపాలి

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ నుంచి హైదరాబాద్‌కు ఉదయం 5 గంటల సమయంలో బస్సును నడుపాలని అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రసమల్ల అశోక్, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బానోత్ గోవింద్ నాయకులు అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా కేంద్రాల్లో డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉదయం ఐదు గంటల సమయంలో హైదరాబాద్‌కు బస్సు నడిపే వారని తర్వాత ఆ బస్సును నిలిపివేశారని అన్నారు. హైదరాబాద్‌కు నేరుగా వెళ్లే వీలు లేకుండా నిర్మల్ వెళ్లి అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తుందని అన్నారు. ఖానాపూర్ మున్సిపాలిటీగా అభివృద్ధి చెందిందని, హైదరాబాద్‌కు వెళ్లేవారు సైతం ఎక్కువయ్యారని అన్నారు. ఇప్పటికైనా డిపో మేనేజర్ స్పందించి ఖానాపూర్ నుంచి హైదరాబాద్‌కు బస్సును నడపాలని కోరారు.

యాదవ సభను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఈనెల 8న రాష్ట్ర రాజదాని హైదరాబాద్‌లో జరిగే యాదవ ఉద్యా నిర్వాహణ వేడుకలకు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు రాపెల్లి రవీందర్ తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రెస్‌భవన్‌లో పోస్టర్లు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు దాసరి పోషన్న, చలివేరి మల్లేశ్, పులినేని సత్యనారాయణ, నాగుల భీమన్న, శ్రీనివాస్, కృష్ణమూర్తి, రాజు, అశోక్, పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా కేంద్రంలోని శ్రీ గండి రామన్న క్షేత్రంలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో శనివారం హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద ప్రత్యేకపూజలు చేశారు. ఆమెకు ఆలయ ట్రస్టీ చైర్మెన్ జగన్మోహన్‌రెడ్డి స్వాగతం పలికారు. పూజారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా జడ్జీ మాట్లాడుతూ షిరిడి దివ్య క్షేత్రాన్ని పోలిన విధంగానే ఇక్కడి ఆలయం ఉందని, ప్రకృతి ఒడిలో ఎంతో ఆహ్లాదకరంగా ఆలయ పరిసరాలు ఉన్నాయని కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

పిచ్చి కుక్కల దాడిలో 11మందికి గాయాలు

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని మార్కెట్ ప్రాంతంలో శనివారం ఒకే రోజు పిచ్చి కుక్కలు 11 మందిపై దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు అందరూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్సలు పొందుతున్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది దృష్టి సారించి, పిచ్చి కుక్కల బెడద లేకుండా చూడాలని గ్రాస్తులు కోరారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పర్చుకోవాలని జిల్లా శిక్షణ కలెక్టర్ వికాస్ మోహతో అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీటీడబ్ల్యూఆర్జేసీ కళాశాలలోని స్టార్ 50 సమావేశ మందిరంలో తెలంగాణ ఎకనామిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రి ఎకనామిక్స్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాలను పెట్టుకొని ఆ లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ఆయా యూనివర్సిటీల నుంచి ప్రొఫెసర్ల హాజరై, గిరిజన విద్యార్థులకు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ స్వామి సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే

నవతెలంగాణ-పెంబి

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఖానాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు జాదవ్ రాంకిషన్ నాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని పెంబి, మందపల్లి, నాగపూర్, లోతోర్య తదితర గ్రామాలలో పర్యటించి, గడప గడపకు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ హామీలను ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. రానున్న ఎన్నికలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో కనక రావు, మల్లయ్య, ఏమ్లా నాయక్, రామ్ పటేల్, విజయ్ సాగర్, శంకర్, రాజన్న ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి శస్త్ర చికిత్సలు



నవతెలంగాణ-ఖానాపూర్

మండలంలోని పలు గ్రామాలకు చెందిన 19 మంది రోగులను లయన్స్ క్లబ్ ఆఫ్ ఖానాపూర్, ఆదిత్య ఐకేర్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి ఆపరేషన్ల కోసం ఆర్మూర్‌లోని లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. నేత్ర వైద్య సహాయకులు కొడగంటి సన్నిత్ కుమార్, రోగులకు కంటి పరీక్షలు జరిపి 19 మందికి ఆపరేషన్లు అవసరమని సిఫార్సు చేశారు. ఈ మేరకు లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌కు చెందిన ప్రత్యేక బస్సును బోధన్ కంటి ఆస్పత్రి నుంచి సమకూర్చారు. రోగులతో పాటు వారి సహాయకులను ఉదయం 11 గంటలకు బస్సులో ఆర్మూర్ పంపించారు. రాను పోను ఉచిత రవాణాతో పాటు, ఆపరేషన్లు, మందులు, లెన్స్, కంటి అద్దాలు, భోజనం లాంటి అన్ని సౌకర్యాలను ఉచితంగా కల్పించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్ జాగరణ్ తెలుగు దినపత్రిక సంపాదకులు అల్వాల హన్మంతు, లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ 320డి జిల్లా అదనపు క్యాబినెట్ కోశాధికారి పాలెపు సుదర్శన్, జిల్లా ప్రతినిధులు ఏ.సంజీవరావు, కె.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాస్‌రావు, తాండ్ర చంద్రశేఖర్‌రావు, ఆదిత్య ఐకేర్ నేత్ర వైద్య సహాయకులు కె.సన్నిత్ కుమార్, దివ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే పల్లెలు అభివృద్ధి

- ఎమ్మెల్యే జోగు రామన్న



నవతెలంగాణ-బేల

బీఆర్‌ఎస్ హయంలోనే పల్లెలు అభివృద్ధి చేందాయని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం మండలంలోని సాంగ్వి గ్రామ పంచాయతీలో రూ.5లక్షల వ్యయంతో నిర్మించనున్న సవారి బంగ్లా షెడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అదేవిధంగా మంగ్రూడ్, దహేగావ్, గూడా గ్రామాల్లో కమ్యూనిటీ షెడ్ ప్రారంభోత్సవంతో పాటు మనియార్‌పూర్ గ్రామంలో వంతెన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అదేవిధంగా భవాని మందిరం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. తొమ్మిదేండ్ల అనతికాలంలోనే నియోజకవర్గంలో కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి, అనేక అభివృద్ధి పనులు పూర్తి చేశామని అన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి బూటకపు హామీలు ఇచ్చే ప్రతిపక్ష నాయకులను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో అమలవుతున్న పథకాలు కొనసాగాలంటే తిరిగి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే రావాలని అన్నారు. ఎన్నికల సమయంలో వచ్చే ప్రతిపక్ష పార్టీల నాయకులు ప్రజలకు కల్లిబొల్లి మాటలు చెప్పే ప్రయత్నాలు చేస్తున్నారని తెలియజేశారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లోనూ అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధిని చేసి చూపించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రౌత్ మనోహర్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, సర్పంచ్ చంద్రకళ, నాయకులు గంబీర్ ఠాక్రే, సతీష్ పవార్, రోహిదాస్, వినోద్, దత్తు, వసంత్ రావ్, కిష్టు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే రేఖానాయక్



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

చాలీచాలని వేతనంతో పనిచేస్తున్న ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. శనివారం ఆమె ఆశావర్కర్లు చేస్తున్న దీక్షా శిభిరాన్ని సందర్శించి మాట్లాడారు. ఆశావర్కర్ల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పనికి తగిన వేతనం ఇవ్వకుండా ఆశావర్కర్లతో వెట్టిచాకిరి చేయించుకోవడం సమంజసం కాదన్నారు. అలాగే మధ్యాహ్న బోజన కార్మికుల శిబిరాన్ని సందర్శించి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను వారికి మద్దతు తెలిపారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే రేఖానాయక్ కళ్యాణలక్ష్మీ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

నిర్మల్ : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పి. గంగామణి సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లపై మొండి వైఖరిని ప్రదర్శించడం సమంజసం కాదన్నారు. ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. వెంటనే చర్చలు జరిపి డిమాండ్లను పరిష్కరించాలని అన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, జ్యోతి, సుధ, ఇంద్రమాల, సులోచన, గంగామణి, లావణ్య, దేవిక, తనుశ్రీ, సుగుణ, సుశీల, సరస్వతి, మహిముదా, కమలాక్షి, విజయ, రాధ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆడపడుచులకు అండగా తెలంగాణ ప్రభుత్వం

- ఎంపీపీ తూము లక్ష్మీబాయి



నవతెలంగాణ-కుభీర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పండగకు అన్ని రకాల సదుపాయాలు కల్పించి వారికి అండగా ఉండేందుకు ఎంతో కృషి చేస్తోందని ఎంపీపీ తూము లక్ష్మీబాయి అన్నారు. శనివారం మండలంలోని పార్డి(బి) గ్రామ పంచాయతీలో బతకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బతకమ్మ పండగ సందర్భంగా గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క మహిళలకు బతకమ్మ కానుకగా బతకమ్మ చీరలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వం విడుదల చేసిన ప్రతి ఒక పథకాన్ని ప్రజలకు అందించేందుకు మండల నాయకుల సహకారంతో అన్ని గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. రైతులకు రైతు రుణమాఫీ కూడా త్వరలోనే పూర్తి స్థాయిలో చేస్తుందని అన్నారు.

రానున్న రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వం మరిన్ని అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు రైతులకు అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు శేరి సురేష్, ఉపసర్పంచ్ తుకారాం, వార్డు సభ్యులు లక్ష్మణ్, నారాయణ, గణేష్, ఐకేపీ సిబ్బంది సాయినాథ్, రమేష్ మహిళ సంఘాల అధ్యక్షురాలు, మహిళలు, గ్రామస్తులు ఉన్నారు.

కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



నవతెలంగాణ-ఖానాపూర్

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు పొలడుగు సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం ఖానాపూర్ పట్టణంలోని మున్సిపల్ వాటర్ ట్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 8 నుంచి నిరవధిక సమ్మె చేడుతున్నట్టు తెలిపారు. పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో చెల్లిస్తున్నట్లుగానే మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు రూ.21వేలు చెల్లించి పర్మినెంట్ చేయాలని అన్నారు.

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కూడా ఐఆర్ చెల్లించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని అన్నారు. ప్రమాద బీమా రూ.10లక్షలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.10 లక్షలు ఇవ్వాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులందరికీ వేతనాలు పెంచి, పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గంగాధర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ పాల్గొన్నారు.

విద్యపై పోషకులకు అవగాహన

నవతెలంగాణ-నార్నూర్

పోషకులు తమ పిల్లలకు రోజు పాఠశాలకు పంపాలని ఎంఈఓ ఆశన్న సూచించారు. శనివారం మండలంలోని గుంజాల ప్రాథమిక పాఠశాలలో సంకల్ప సప్తహ కార్యక్రమంలో భాగంగా పోషకులకు విద్యపై అవగాహన కల్పించారు. విద్య ప్రాధాన్యత ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చౌహాన్ రామారావ్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కావల రమేష్, ఏఈ సుభాని, స్థానిక సర్పంచ్ సావిత్రిబాయి, ఉపసర్పంచ్ చందా, కార్యదర్శి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కృష్ణ, నాయకులు న్యానేశ్వర్, అరికేల కేశవ్ ఉన్నారు.



బతుకమ్మ చీరల పంపిణీ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని ధర్మోరా గ్రామంలో శనివారం బతుకమ్మ చీరలను వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఆడపడుచులకు ఓ పెద్దన్నగా బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తోందని అన్నారు. అంతకుముందు ఆడబిడ్డ పుట్టిందంటే లక్షలు ఖర్చు చేయాల్సి వచ్చేదని దీనిని గుర్తించిన సీఎం కేసీఆర్ ఆడపిల్లలు భారం కాకూడదని కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శారద, సీఏ రచన, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేసిన గల్ఫ్ కార్మికుడు



నవతెలంగాణ-కడెం

మండలంలోని చిట్యాల గ్రామానికి చెందిన అలిశెట్టి భాగ్యవ్వ రాజం చాలా నిరుపేద కుటుంబం వారికి గల్ఫ్ కార్మికుడు శనివారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. దురదృష్టవశత్తు భాగ్యవ్వకు గుండె సంబంధిత వ్యాధి ఉందని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లమని డాక్టర్ సూచించారు. ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్న కుటుంబానికి మానవసేవే మాధవసేవ అనే గ్రూప్ సభ్యులు శనివారం వారి ఇంటికి వెళ్లి భాగ్యవ్వ కుటుంబానికి ఆర్థిక సాయంగా రూ.6210 అందజేశారు. ఈ సందర్భంగా గ్రూప్ సభ్యులు మాట్లాడుతూ గత మూడు నెలలుగా ముగ్గురు బాధిత కుటుంబాలకు గల్ఫ్ దేశం వెళ్లిన కూడా నిరుపేదలకు సాయం చేయాలని తపనతో గల్ఫ్ దేశంలో పని చేస్తూ, వచ్చిన సాలరీ నుంచి నిరుపేదలకు అండగా ఉండాలని ఆకాంక్షతో మండలంలోని అంబారిపేట్ గ్రామానికి చెందిన శేటొపెల్లి మహేష్ మానవసేవే మాధవసేవ అనే వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి తన మిత్రులను సహచరులను గ్రామస్తులను ఆ గ్రూప్ నందు జాయిన్ చేసి ప్రతినెల తమ గ్రూప్ తరపున మండలంలోని నిరుపేదలకు ఆర్థిక సాయం గ్రూప్ సభ్యుల సాయంతో అందజేస్తూ నిరుపేద కుటుంబాలకు మేము అండగా ఉన్నామని తమ గ్రూప్ ద్వారా భరోసానిస్తున్నారు. మానవసేవే మాధవసేవ గ్రూప్ వ్యవస్థాపకులు మహేష్ గ్రూప్ ముఖ్య ఉద్యేశాన్ని వారి మాటల్లో తెలియజేస్తూ, నిరుపేద ప్రజలకు తమ ద్వారా తోచిన సాయం చేస్తూ, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే మా లక్ష్యమని అన్నారు. నిరుపేదలకు చేసే ఆర్థిక సాయాలు చూసి గ్రామంలోని పలువురు వారిని ప్రశంసించారు.

అంగన్‌వాడీ అభివృద్ధి పనులకు భూమిపూజ

నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని బిలోలి గ్రామంలో రూ.5లక్షల నిధులతో మినీ అంగన్‌వాడీ కేంద్రానికి రూ.3.5లక్షలు, పాఠశాల ప్రహరీ నిర్మాణానికి రూ.1.5లక్షలు సర్పంచ్ సవిత నర్సింగ్‌రావు భూమిపూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో టాయిలెట్ బ్లాక్ నిర్మాణానికి మున్సిపల్ చైర్మెన్ గంఢ్రత్ ఈశ్వర్ భూమిపూజ చేశారు. శనివారం ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం, మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కృషితో నిధులు మంజూరు అయ్యాయని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్, కౌన్సిలర్ పూరడి శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన వారికి ఇండ్ల స్థలాలు

నవతెలంగాణ-ముధోల్

తెలంగాణ ప్రభుత్వం అర్హులైన వారికి ఇండ్ల స్థలాలను పంపిణీ చేస్తుందని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మండలంలోని గన్నోరా గ్రామంలోని లబ్ధిదారులకు జీఓ నెంబర్ 58 ప్రకారం ఇండ్ల స్థలాల పట్టాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్ ఖాన్, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, సర్పంచ్ లావణ్య కిష్టయ్య, కోఆప్షన్ సభ్యులు మగ్దూమ్, ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గంగారెడ్డి, పెద్దమల్లు, చిన్నమల్లు, కత్తి లక్ష్మణ్, రాములు, అనిత, ప్రభాకర్, దేవన్న, పోతన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం కేసు నమోదు

నవతెలంగాణ-లోకేశ్వరం

మహిళ అదృశ్యమైన సంఘటన లోకేశ్వరం మండలకేంద్రంలో చోటు చేసుకుంది. మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన మహిళ అదృశ్యం అయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయాబాయి గురువారం తెల్లవారుజామున ఇంటి నుంచి వెళ్లి, రాత్రి అయిన తర్వాత కూడా తిరిగి రాలేదు. ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో, శుక్రవారం ఆమె భర్త తుక్కుడేదాస్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నర్సింగ్ కోర్సులో సీటు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం

నవతెలంగాణ-భైంసా



పట్టణంలోని గురుకృపా ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎంపీహెచ్ డబ్ల్యూ కోర్సులో చదువును పూర్తిచేసుకుని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో సీటు సాధించిన విద్యార్థినులు ఎస్.శ్రీలక్ష్మి రిమ్స్ ఆదిలాబాద్ నర్సింగ్ కళాశాల, సీహెచ్ ప్రవంతి బాన్సువాడ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో సీటు సాధించారు. వీరికి గురుకృపా కళాశాల యాజమాన్యం ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా బీఎస్సీ నర్సింగ్ కోర్సులో సీటు సాధించిన విద్యార్థులు మాట్లాడుతూ గురుకృపా కళాశాల ద్వారా చదువుతో పాటు భైంసా ప్రభుత్వ ఆస్పత్రిలో శిక్షణను అందించడం ద్వారా తాము బీఎస్సీ నర్సింగ్ కోర్సులో రాణించగలుగుతున్నామని అన్నారు. మా ఉన్నతికి సహకరిస్తున్న తల్లిదండ్రులకు, కళాశాల యాజమాన్యానికి, అధ్యాపకులకు ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో గురుకృపా ఒకేషనల్ జూనియర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్, శారద ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు శ్రీమతి ముష్కం ప్రసన్న రాణి, డాక్టర్ పోశెట్టి, కళాశాల ప్రిన్సిపాల్ సాయినాథ్, అధ్యాపకులు నరేష్‌గౌడ్, గణేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మదగ్గ తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | అక్టోబర్ 08, 2023 | www.navatelangana.com

టీజీబీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండలంలోని రుద్రపూర్ గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రవీంద్ర నగర్-1 బ్రాంచ్ మేనేజర్ కిరణ్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాజాత బృందంచే పొదుపు చేయడంలో పాటించే మెళుకువలు, సామాజిక భద్రత పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ కిరణ్ మాట్లాడుతూ ఆధార్ అనుసంధానం చేసుకుని వేలిముద్రల సహాయంతో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సీఎస్పీ సెంటర్ల ద్వారా లావాదేవీలు చేసుకోవాలని, టీజీబి దిశ యాప్ ద్వారా చరవానిలో ఖాతా తీసుకోవచ్చు అని అన్నారు. డిజిటల్ లావాదేవీలు జరిపేవారు తమ పిన్ నంబర్‌ను ఎవరికీ తెలియజేయకూడదని తెలిపారు. పంట రుణాలను సంవత్సరములోపు ఏడు శాతం వడ్డీ ఉంటుందని, అందరు రైతులు తమ రుణాన్ని రెనివల్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సీహెచ్ రాజశేఖర్, సీఎస్పీలు, రైతులు, మహిళ సంఘాలు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

నవతెలంగాణ -వేమనపల్లి

మండలంలోని బుయ్యారం గ్రామ పంచాయితీలో శనివారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆదేశాల మేరకు బీఆర్ఎస్ మండల అధ్యక్షులు కోలి వేణుమాధవ్‌రావు డిఎంఎఫ్టి నిధులు రూ.5లక్షలతో డ్రైనేజి పనులు ప్రారంభించారు. సురారం గ్రామ పంచాయతీలో ఎస్డిఎఫ్ నిధులు రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. అనంతరం చామనపల్లి గ్రామ పంచాయతీలోని బొమ్మెన గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10 లక్షలతో సిసి రోడ్డు, బద్దెంపల్లిలో రూ.10లక్షలతో గ్రావెల్ రోడ్డు పనులు ప్రారంభించారు. బద్దెంపల్లి గ్రామంలో యువకులకు కేసీఆర్ క్రీడా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో సురారం సర్పంచ్ పల్లె రమేష్‌గౌడ్, బుయ్యారం సర్పంచ్ శ్రీనివాస్, చామనపల్లి సర్పంచ్ జెల్లా మొండి, ఉప సర్పంచ్ మహేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆత్రం గణపతి, సహకార సంఘం చైర్మన్ కుబిడే వెంకటేశం పాల్గొన్నారు.

మహిళలు సమస్యలపై నిర్భయంగా సంప్రదించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలున్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని ఎస్పీ కే.సురేష్ కుమార్ తెలిపారు. శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహిళల రక్షణకోసం షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినీలు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడవద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. కళాశాల, పాఠశాలల విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, ఫోక్సో, షీటీం, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్‌పై జిల్లాలో అవగాహన కల్పించామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు షీటీంకు 28 ఫిర్యాదులు వస్తే 08 ఎఫ్ఐఆర్‌లు, 11 కౌన్సెలింగ్, ఒక్క పెట్టి కేసు నమోదు చేశామని తెలిపారు. ఈనెల 59 హాట్ స్పాట్ సందర్శన చేస్తూ విద్యార్థులకు 17 అవగాహన కార్యక్రమాలను నిర్వహించామన్నారు. విద్యార్థినీలను వేధిస్తున్న ఇద్దరకీ ఈనెల వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. చిన్న పిల్లల రక్షణ విషయంలో పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతుందన్నారు. మహిళలు సామాజిక మాధ్యమాలు ఫేస్ బుక్, వాట్సాప్, ఇన్‌స్టగ్రామ్ వినియోగంలో చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫొటోలు, వీడియోలు పోస్టుచేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరుగా సంప్రదించలేని వారు 8712670564, లేదా డయల్ 100కు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలకేంద్రంలోని రైతువేదికలో సోమవారం ప్రభుత్వం ద్వారా వచ్చిన తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలకు క్రీడా సామగ్రిని జడ్పీటీసీ సరిత అందజేశారు. ప్రతి క్రీడా ప్రాంగణానికి క్రికెట్ కిట్టు, వాలీబాల్ కిట్టు, టీ షర్టులు, డంబుల్స్ వంటి సామగ్రిని ప్రతి క్రీడా ప్రాంగణానికి అందజేయనున్నట్టు, గ్రామాల్లో యువకులు క్రీడలపై ఆసక్తి కనబరిచేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీనివాస్, రాజన్న, మధునయ్య, ఎంపీటీసీ దూగుంట రాజన్న, కోఆప్షన్ సభ్యుడు సాజిద్, ఎంపీడీఓ గంగాసింగ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప జన్మదినం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు నాయకులు పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, కాగజ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ కాసం శ్రీనివాస్, సర్పంచ్ భీమేష్, నాయకులు నిసార్ పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

పెంచికల్‌పేట్ : ఎమ్మెల్యే కోనేరు కోనప్ప జన్మదినాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, జడ్పీటీసీ సముద్రాల సరిత పండ్లు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీనివాస్, రాజన్న, సాజిత్, బీఆర్ఎస్ నాయకులు సముద్రాల రాజన్న, బండి చలం, శ్రీనివాస్, చౌదరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు వరం బతుకమ్మ చీరలు

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని తుంగెడ గ్రామంలో శనివారం బతుకమ్మ చీరలను ఎంపీపీ జుమ్మి సౌందర్య ఆనంద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దసరా పండుగకు కానుకగా ఆడబిడ్డలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన చీరలు వరమన్నారు. మహిళల కోసం సీఎం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. కళ్యాణలక్ష్మీ, కేసీఆర్ కిట్టు, గృహలక్ష్మి ఇలాంటి సంక్షేమ పథకాలు ఎన్నో ప్రవేశపెట్టి మహిళల ఆత్మగౌరవాన్ని పెంచుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తుంగెడ సర్పంచ్ డోంగ్రి పెంటయ్య, ఉప సర్పంచ్ సాయికృష్ణ, వార్డు సభ్యులు ధర్మయ్య, గ్రామ కార్యదర్శి రాధిక, నాయకులు పాల్గొన్నారు.

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన యువకులకు సన్మానం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని చెడ్వాయి రైతువేదికలో చెడ్వాయి, ధరోగపెల్లి గ్రామాలకు చెందిన యువకులు పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఆరుగురు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన యువకులను రైతువేదికలో చెడ్వాయి సర్పంచ్ చౌదరి సుజాత శ్రీనివాస్ వారిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసింగ్, ఎంఈఓ రమేష్‌బాబు, నాయకులు బాబు, సత్యన్న, పంచాయతీ కార్యర్శి రాకేష్, వెంకటేశ్, గ్రామస్తుల ఇస్మాయిల్, దస్తగిరి, రవి పాల్గొన్నారు.

కండ్లకు గంతలతో కార్మికుల నిరసన

నవతెలంగాణ-రెబ్బెన

సమస్యల సాధన కోసం పది రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మధ్యాహ్న భోజన కార్మికులు ఆరోపించారు. శనివారం ప్రభుత్వ వైఖరిని ఎండగట్టుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె శిబిరంలో కండ్లకు కట్టుకొని నిరసన తెలిపారు. 10 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందనలేదని, చర్చలు జరిపి న్యాయపరమైన సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం మొండివైఖరి వహిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇదే విధంగా నిర్లక్ష్య వైఖరి వహిస్తే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాగిడి మాయ, గౌత్రె లక్ష్మీ, పోసుబాయి, తానుబాయి, హసీనా పాల్గొన్నారు.

ఆడపిల్లలను బతకనిద్దాం..బతుకునిద్దాం

- ఆసిపాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్
- భేటి బచావో భేటి పడావోపై సమీక్ష

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆడపిల్లలను బతకనిచ్చి వారికి మంచి చదువు చెప్పి బతుకునిద్దామని జిల్లా కలెక్టర్ బోర్కడ హేమంత్ అన్నారు. జిల్లాలో భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు విద్య, వైద్యం అందించే అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, ఆడపిల్లలను కాపాడుకోవాలని అన్నారు. పాఠశాలలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలో విద్యార్థినులు, బాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, గ్రామపంచాయతీలలో భేటీ పడావో భేటీ బచావో కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో షిటీంల ద్వారా గ్రామాలలో బాలికలు, ఆడపిల్లల చదువుపై భరోసా కల్పించాలని, మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో పాఠశాలల నుండి డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలలకు వచ్చే విధంగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. బాలికలు చదువుతోపాటు క్రీడారంగంలో రాణించే విధంగా ప్రోత్సహించాలని, అందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు ఆత్మరక్షణపై నైపుణ్య శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం భేటి బచావో భేటీ పడావో కార్యక్రమ సంబంధిత వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి సావిత్రి, వైద్యాధికారి తుకారాం బట్, డిపిఓ సురేందర్, డిటిడిఓ రమాదేవి, డిఇఓ అశోక్, సిఐ రమేష్, డిసిపిఓ మహేష్ పాల్గొన్నారు.

కనీస మద్దతు ధర రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



2023-24 సంవత్సరానికి వానాకాలంలో రైతులు పండించే వివిధ పంట ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు పంటలను విక్రయించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, దీనికి ఆధార్ ప్రామాణికరణ తప్పనిసరి చేసినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పంటకు మద్దతు ధర పొందాలంటే తప్పనిసరిగా ఆధార్ నెంబర్ కలిగి ఉండాలన్నారు. రైతులకు ఆధార్ నెంబర్‌తో లింక్ అయి ఉన్న బ్యాంకు ఖాతాలో పంటకు సంబంధించిన మొత్తం జమ చేయడం జరుగుతుందన్నారు. వాడుకలో ఉన్న బ్యాంకు ఖాతాను ముందస్తుగా నిర్ధారణ చేసుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉంటుందన్నారు. పత్తి పంటకు సంబంధించి రైతులు జిల్లాలో ఉన్న 18 మిల్లులలో అమ్మకాలు చేయవచ్చన్నారు. జిల్లాలో మూడు మార్కెట్ కమిటీలు ఉండగా ఆసిఫాబాద్ పరిధిలో 13, కాగజ్‌నగర్ పరిధిలో 2, జైనూర్ పరిధిలో 1 జిన్నింగ్ మిల్లు ఉందన్నారు. వీటితోపాటు ఆదిలాబాద్ పరిధిలో 2 జిన్నింగ్ మిల్లులు జిల్లాలో కొనసాగుతున్నాయని తెలిపారు. మద్దతు ధరకు సంబంధించి వివరాలను వెల్లడిస్తూ పొడుగు పింజపత్తికి 7020, పింజరకం (బిబిఎస్పిఎల్)కు 6970, పింజరకం (మెక్) రకానికి 6920 రూపాయలు నిర్ణయించినట్లు తెలిపారు. వరి సాధారణ రకానికి 2,183 రూపాయలు, వరి గ్రేడ్ ఏ రకానికి 2,203 రూపాయలు, హైబ్రిడ్ జొన్న 3,180 రూపాయలు, సజ్జలు 2,500 రూపాయలు, రాగి 3,846 రూపాయలు, మొక్కజొన్న 2,090 రూపాయలు, కందులు 7 వేల రూపాయలు, పెసర్లు 8,558 రూపాయలు, మినుములు 6,950 రూపాయలు, వేరుశనగ 6,377 రూపాయలు, సోయాబీన్ 4,600 రూపాయలు, నువ్వులు 8,635 రూపాయలు, పొద్దుతిరుగుడు 6,760 రూపాయలు, పత్తి మధ్య రకానికి 6,620 రూపాయలు నిర్ణయించినట్లు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, ప్రభుత్వ కనీస మద్దతు ధరకు పంటలు విక్రయించి అభివృద్ధి చెందాలని తెలిపారు.

చంద్రబాబు అరెస్టుకు టీడీపీ శ్రేణుల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఆ పార్టీ శ్రేణులు శనివారం రాత్రి సెల్ ఫోన్ టార్చ్ లైట్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అత్యుత్తమ నాయకుడు చంద్రబాబు అని, అటువంటి వ్యక్తిని అరెస్టు చేయడం దారుణమన్నారు. చేయని పాపంలో చంద్రబాబును సూత్రధారిని చేయడానికి జగన్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. రానున్న రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. వెంటనే చంద్రబాబును విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి రాచబత్తుల మల్లికార్జున్, నియోజకవర్గ ఇన్‌చార్జి పెరుగు ఆత్మరామ్, ఎస్సీ సెల్ నాయకుడు రవి పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ అధిష్టానం పిలుపు మేరకు శనివారం రాత్రి లైట్లు ఆర్పీ, సెల్‌టార్చ్‌లు వెలిగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు జి ఆనంద్ మాట్లాడుతూ చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కావాలనే బాబును అరెస్టు చేసి కార్యకర్తలను అయోమయానికి గురి చేయడానికి జగన్ ప్రభుత్వం యత్నిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గుల్లపల్లి లావణ్య, నాయకులు చల్లూరి శంకర్, గులాబ్‌రావు, సంజీవ్, తాహెర్, అబ్దుల్, తిరుపతిగౌడ్, సమ్మగౌడ్ పాల్గొన్నారు.

బెజ్జూర్ సొసైటీ అవినీతిపై విచారణ చేపట్టాలి

నవతెలంగాణ-బెజ్జూర్



బెజ్జూర్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో జరిగిన అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఆరోపించారు. శనివారం మండలకేంద్రంలోని బెజ్జూర్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఏడీసీసీ బ్యాంకు ముందు రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ పంట రుణాలు పొందిన ప్రతి రైతుకు రూ.లక్షలోపు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి నేటికి ఈ ప్రక్రియ పూర్తిచేయలేదన్నారు. బెజ్జూర్ సొసైటీలో రూ.కోటి కుంభకోణం జరిగినట్టు ఆయన ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పంట రుణమాఫీ జరిగినట్టు మెసేజ్‌లు వచ్చిన మాఫీ డబ్బులు ఇవ్వడంలో బ్యాంకు అధికారులు రైతులను తిప్పుకుంటున్నారని, నాలుగు రోజుల్లోగా పంట రుణమాఫీ డబ్బులను ఇవ్వని పక్షంలో కలెక్టరేట్ కార్యాలయాన్ని రైతులతో ముట్టడిస్తామని హెచ్చరించారు. 2020 సంవత్సరంలో మంజూరైన పంటల బీమా డబ్బులను కాజేశారని ఆరోపించారు. బెజ్జూర్ సొసైటీలో 840 మంది ఉండగా, కేవలం 590 మంది రైతులకు మాత్రమే వచ్చినట్టు ఆయన ఆరోపించారు. మిగతా 290 మంది రైతులకు రుణమాఫీ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కోంద్ర మనోహర్‌గౌడ్, కొప్పుల శంకర్, మాజీ జడ్పీటీసీ పాల్వాయి సుధాకర్‌రావు, రెబ్బెన ఎంపీటీసీ దాగామ శంకరమ్మ, కర్జెల్లి సర్పంచ్ నానయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి భిక్షపతి, నాయకులు తాళ్ల రామయ్య, రాకేష్, వసీఖాన్, మల్లయ్య, శ్యాంసుందర్, జాడి దిగంబర్ కారం సతీష్, మోహన్, తుకారాం పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమ్మెకు సీపీఐ నాయకుల మద్దతు

నవతెలంగాణ-రెబ్బెన

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్న ఆశావర్కర్లకు శనివారం సీపీఐ నాయకులు మద్దతు ప్రకటించారు. కార్యకర్తల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు సమ్మె చేస్తున్న ఆశాలపై స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో పూదరి సాయి, బాలునాయక్ పాల్గొన్నారు.

కెరమెరి : ఆశా వర్కర్ల నిరవధిక సమ్మెలో భాగంగా శనివారం 13వ రోజుకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంటవార్పు కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల సంఘం మండల నాయకురాలు అరుణ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించే వరకు ప్రభుత్వంపై పోరాటం కొనసాగుతుందన్నారు. చాలిచాలని వేతనాలతో మారుమూల గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్నామని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు జారుబాయి, కన్నిబాయి, భీంబాయ్ పాల్గొన్నారు.



యువత మరిన్ని విజయాలు సాధించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన పోలీసు ఉద్యోగాల్లో నియోజకవర్గాల నుండి పెద్ద ఎత్తున యువత ఉద్యోగాలు సాధించారని, భవిష్యత్తు మరిన్ని విజయాలు సాధించాలని కాంగ్రెస్ నాయకుడు అజ్మీర శ్యామ్ నాయక్ అన్నారు. కానిస్టేబుల్‌గా ఎంపికైన మండలంలోని మోతుగూడ గ్రామానికి చెందిన పిప్రే కృష్ణను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలన్నారు. గ్రామంలోని ప్రతి ఒక్క యువకుడికి కృష్ణ ఆదర్శప్రాయమని కొనియాడారు. మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో పోశయ్య, పిప్రే రాజయ్య, భీమన్‌కార్ కిష్టయ్య, మహేష్, పార్టీ పట్టణ అధ్యక్షులు మురళి పాల్గొన్నారు.

స్థలం కేటాయించాలని వినతి

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నాయీబ్రాహ్మణులు మండలకేంద్రంలో కుల సంఘ భవనం నిర్మించడానికి స్థలం కేటాయించాలని డిప్యూటీ తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలకేంద్రంలో సర్వే నెంబర్ 177లో అర ఎకరం భూమిని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణుల సంఘం సభ్యులు శంకర్, నాగులు, నాందేవ్, రవి, సత్తన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, లోడ్‌పెల్లి సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ దూగుంట రాజన్న పాల్గొన్నారు.

గోలేటి భీమన్న మైదానంలో హాకీ పోటీలు

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని శ్రీభీమన్న మైదానంలో శనివారం డబ్ల్యుపీఎస్అండ్‌జీఏ 90వ వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా డిపార్టుమెంట్ హాకీ పోటీలు నిర్వహించారు. పోటీలో ఖైరిగూడ పీఓ జట్టు, ఎస్‌ఓటూ జీఎం జట్టు చెరో పాయింట్ సాధించడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఖైరిగూడ ఓసీ సీనియర్ అండర్ మేనేజర్ రాంటెంకి మల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై పోటీలను వీక్షించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరిరావు, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రోడ్ల పనులకు భూమిపూజ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని లోడ్‌పెల్లి, ఎల్లూరు, ఎలుకపెల్లి, పెంచికల్‌పేట్ గ్రామాల్లో సీసీ రోడ్లకు, మురుగు కాలువలకు, ప్రహారిగోడల కోసం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జాజిమొగ్గ శ్రీనివాస్, దుర్గం రాజన్న, మేకల కమల, పొర్తెటి మధునయ్య, ఎంపీటీసీ దూగుంట రాజన్న, కోఆప్షన్ సభ్యుడు సాజిద్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్‌ను సందర్శించిన ఎంపీపీ సౌందర్య ఆనంద్

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని తుంగెడ గ్రామంలో జెడ్పీ హైస్కూల్‌ను ఎంపీపీ సౌందర్య సందర్శించారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని సూచించారు. పాఠశాలలో మూత్రశాలలు లేకపోవడంతో చాలా ఇబ్బందులకు గురవుతున్నామని, మంచినీటి సౌకర్యం కల్పించాలని, బోర్‌వెల్ మంజూరు చేయాలని పాఠశాల ఉపాధ్యాయులు ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ సానుకూలంగా స్పందించి అతిత్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వినయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోల్ ఇండియా క్రీడల్లో రాణించాలి

నవతెలంగాణ-మందమర్రి

కోల్ ఇండియా నిర్వహించే క్రీడల్లో రాణించి ఏరియాకు, సంస్థకు గుర్తింపు తీసుకురావాలని ఏరియా స్టోర్స్ డివైఎస్ఈ ఫైడిశ్వర్ క్రీడాకారులకు సూచించారు. డబ్ల్యుపిఎస్ జిఏ ఆధ్వర్యంలో 59వ వార్షిక క్రీడల్లో భాగంగా లాన్ టెన్నిస్ క్రీడలను శనివారం ప్రారంభించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు కంపెనీ లెవెల్ కోల్ ఇండియా స్థాయి క్రీడా పోటీలలో రాణించి సంస్థకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రీడల గౌరవ కార్యదర్శి కార్తీక్, సమన్వయకర్త రవికుమార్, జనరల్ కెప్టెన్ చిన్నయ్య, గ్రౌండ్ ఇన్‌చార్జి తిరుపతి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ మండల, పట్టణ అధ్యక్షుల నియామకం

నవతెలంగాణ-జన్నారం

ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షునిగా సాయి నాయక్, పట్టణ అధ్యక్షులుగా రాజకుమార్‌ను నియమించినట్లు రాష్ట్ర కార్యదర్శి సోహెల్‌షా తెలిపారు. మండల కేంద్రంలోని ఎన్ఎస్‌యువై కార్యాలయంలో శనివారం విద్యార్థులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ఎస్‌యుఐ విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తుందన్నారు. నాయకులు సంఘాన్ని బలోపేతం చేయాలని సూచించారు. కాంగ్రెస్ మాజీ మండలాధ్యక్షుడు బోర్లకుంట ప్రభాస్, జిల్లా కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి, కరుణాకర్, రమేష్, నందు, ఇందయ్యా, అఖిల్, అజ్మత్, రాకేష్, సురేష్, గణేష్, వినీత్, తరుణ్, సుమిత్, తిరుపతి పాల్గొన్నారు.

అటవీ శాఖ ఆధ్వర్యంలో వనదర్శిని

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

జాతీయ వన్యప్రాణుల వారోత్సవాల సందర్భంగా పెంచికల్‌పేట్ రేంజ్ పరిధిలో డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో సెయింట్ క్లారిటీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు వనదర్శిని కార్యక్రమంలో భాగంగా లోడ్‌పెల్లి అటవీ ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అడవుల ఆవశ్యకత, అటవీ జంతువుల కోసం ఏర్పాటు చేసిన కెమెరాల పనితీరు, వన్యప్రాణుల సంరక్షణ కోసం ఏర్పాటుచేసిన చెక్‌డ్యాంలను, కెమెరాలో రికార్డైన అటవీ జంతువుల ఫొటోలను చూపించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి రమాదేవీ, బీట్ అధికారులు వెంకటేశ్, మహేష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు

నవతెలంగాణ-కెరమెరి

పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన చాల్బడి, పరందోలి గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని చాల్బడి మారుమూల గ్రామానికి చెందిన కోరంగి గోవిందరావుని కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, పండ్లు, అనారోగ్యానికి సంబంధించిన మందులు అందించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. ఎటువంటి అసాంఘిక శక్తులు, అపరిచిత వ్యక్తులు గ్రామానికి వస్తే వారికి సహాయం చేయవద్దని అన్నారు. వారి నుండి నష్టం తప్ప లాభం లేదని, ఏవైన సమస్యలు ఉంటే ప్రభుత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో భాగంగా తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన పోలింగ్ బూత్ పరందోలి గ్రామాన్ని సందర్శించారు. అత్యంత మారుమూల ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, ప్రస్తుత పరిస్థితులపైన ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు డిఎస్పి ఎం వెంకటరమణ, వాంకిడి సీఐ బి శ్రీనివాస్, కెరమెరి ఎస్సై గుంపుల విజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
ఆదివారం | అక్టోబర్ 08, 2023

అంతర్ జిల్లా చెక్‌పోస్టుల ఏర్పాటు

నవతెలంగాణ-జన్నారం



ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జన్నారం మండలంలోని కలమడుగు, ఇందుపల్లి గ్రామాల సమీపాలలో అంతర్రాష్ట్ర చెకోపోస్ట్ ఏర్పాటు చేశామని జన్నారం ఎస్సై సతీష్ తెలిపారు. శనివారం తెల్లవారుజామున చెక్‌పోస్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి వాహనాన్ని ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు. ఈ చెక్ పోస్ట్‌ల వద్ద పోలీసులు 24 గంటలు డ్యూటీలో ఉంటారన్నారు. ప్రజలు వాహనదారులు సహకరించాలని కోరారు.

బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పట్టణంలోని స్థానిక 20వ వార్డు లెనిన్‌నగర్‌కు చెందిన పురుషోత్తం కనకరాజు ఇటీవల అనారోగ్యసమస్యతో మృతి చెందారు. ఆర్థిక పరిస్థితి సరిగాలేదని విషయం తెలుసుకున్న బాల్కా ఫౌండేషన్ సభ్యులు వారి కుటుంబాన్ని పరామర్శించి, రూ.10000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బీఆర్ఎస్ ఇన్‌చార్జి గాండ్ల సమ్మన్న, స్థానిక కౌన్సిలర్ బోయినపల్లి అనిల్ రావు, కౌన్సిలర్ జాడి శ్రీనివాస్, ఆత్మకూరి మహేందర్, సీనియర్ నాయకులు గోపు రాజం పాల్గొన్నారు.

మేనిఫెస్టోతో ప్రతిపక్షాల మైండ్ బ్లాక్

- కేసీఆర్ సుదీర్ఘ సమాలోచన
- రాష్ట్రంలో ప్రతి ఎకరానికి సాగు నీరు అందిస్తున్నాం
- బీజేపీ డిపాజిట్లు దక్కించుకునే కమిటీ వేయాలి
- రూ.80.50కోట్లతో నిర్మించే పడ్తనపల్లి లిఫ్ట్‌కు శంకుస్థాపన చేసిన మంత్రి హరీష్

నవతెలంగాణ-మంచిర్యాల/చెన్నూర్

బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రకటిస్తే ప్రతిపక్షాలకు మైండ్ బ్లాక్ అయ్యి దిమ్మతిరిగి పోతుందని మంత్రి హరీష్ రావు అన్నారు. శనివారం హాజీపూర్ మండలంలోని పడ్తనపల్లిలో రూ.80.50కోట్ల రూపాయలతో నిర్మించిన లిఫ్ట్‌కు, రూ .3కోట్లతో కొత్తగా ఏర్పాటు చేయనున్న దొనబండ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. మంత్రి హరీష్ రావు దొనబండ గ్రామ శివారులో ఎమ్మెల్యే దివాకర్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన భహిరంగ సభలో విప్ బాల్క సుమన్, ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ అయితే జైత్ర యాత్ర లేదంటే శవ యాత్ర అంటూ కేసీఆర్ నిరాహార దీక్ష, అమరుల త్యాగాలతో వచ్చిన తెలంగాణలో ఏర్పాటైన బీఆర్ఎస్ ప్రభుత్వం 4 కోట్ల తెలంగాణ ప్రజల పక్షాన పలు సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. ముచ్చటగా మూడవ సారి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందన్నారు. రూ.600 పెన్షన్, మోటార్లు మీటర్లు వున్న గుజరాత్‌లో ఎప్పటికీ మేమే గెలుస్తాం అంటున్న బీజేపీ పార్టీ కన్నా మన రాష్ట్రంలో రూ.2 వేల నుండి 3, 4 వేల పెన్షన్, 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న బీఆర్ఎస్ 3వ సారి అధికారంలోకి ఎందుకు రాకూడదని ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలకు ఎక్కువగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఆచరిస్తుంటే దేశం అనుసరిస్తుందనారు. మతాల పేరుతో కాంగ్రెస్, బీజేపీలు రాష్ట్రాన్ని నాశనం చేసే కుట్రలు పన్నుతున్నాయన్నారు. కర్ణాటక నుంచి డబ్బుల సంచులు తెచ్చి తెలంగాణాలో గెలవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. కానీ కేసీఆర్ ముందు పప్పులు వుడకవన్నారు. బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జి నడ్డా తన సొంత రాష్ట్రంలో బీజేపీని గెలిపించుకోలేదు కానీ ఇక్కడ అన్ని కమిటీలు వేస్తున్నాడు, అసలు బీజేపీ డిపాజిట్ దక్కే కమిటీ వేయాలని ఎద్దేవా చేశారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో కరువులేదు, కర్ఫ్యూ లేదన్నారు.గత కాంగ్రెస్, టీడీపీ హయాంలో రాష్ట్రంలో కరువు కాటకాలతో జనాలు రోడ్లపైకి వస్తే కర్ఫ్యూ లు విధించిన సంఘటనలను గుర్తు చేశారు.



హాజీపూర్ భహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి తన్నీరు హరీష్‌రావు

నేను హాజీపూర్ అల్లున్ని..!

తాను హాజీపూర్ అల్లున్నని హరీష్‌రావు అనడంతో సభకు వచ్చిన జనాలు పెద్ద ఎత్తున జై హరీష్ రావు అనే నినాదాలు చేశారు. మా అత్తగారు హాజీపూర్ అని, రాష్ట్రానికి ఎన్నో చేస్తున్న నేను నా అత్తగారు ఊరికి ఏదో చేయాలని మెడికల్ కాలేజీ మండలంలో ఏర్పాటు చేస్తున్నానని తెలిపారు. ఎన్టీఆర్, వై ఎస్సార్‌లు మంచిర్యాలను జిల్లా చేస్తా అని హామీలిచ్చి మరిచారాన్నారు. కేసీఆర్ హయాంలో మంచిర్యాల జిల్లాగా ఏర్పాటైందన్నారు. జిల్లాలో రూ.500 కోట్లతో మెడికల్ కాలేజీ, 600 పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందన్నారు. గతంలో గోదావరి ఒడ్డున వున్న గ్రామాలకు కనీసం తాగు నీరు కరువైందని అన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ గోదావరి నీరు అందిస్తున్నామని తెలిపారు. దివాకర్ రావు కృషితోని మండలంలో పది వేల ఎకరాలకు సాగు నీటి కోసం రూ.80.50 కోట్ల రూపాయలతో పడ్తనపల్లి లిఫ్ట్ ఏర్పాటు చేసినందుకు ఆనందంగా ఉందన్నారు. 18 గ్రామాలలో పాటు మా అత్తగారు ఊరికి కూడా సాగు నీరు అందనుందన్నారు.

ఆసక్తిగా మొదలైన ప్రసంగం

కాగా మంత్రి ప్రసంగం మధ్యలో మైక్ పని చేయక పోవడంతో ఏం రా.. తమ్మి ఇలా చేస్తున్నావు. మా మాటలు బయటకు వినబడ కుండా కాంగ్రెసోల్లు గిట్ల మైక్‌ల ఏమైనా పెట్టారా అని అనడంతో సభలో కేరింతలు కొట్టారు.

హైదరాబాద్‌లో పేకాట క్లబ్బులు, రౌడీ, కబ్జా దందాలు చేసి సంపాదించిన వారు ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచే ప్రయత్నాలు చేస్తున్నారు జాగ్రత్త అన్నారు. అవినీతి మచ్చ లేని దివాకర్ రావును గెలిపించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే దివాకర్‌రావు ప్రసంగం ముగుసిన వెంటనే ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, దివాకర్ రావుకు నీళ్ళ బాటిల్ అందించడంతో అందరూ నవ్వుకున్నారు. హరీష్ రావు, సుమన్, దివాకర్ రావు, చిన్నయ్య, విఠల్‌లు కాసేపు పిచ్చాపాటి నవ్వులతో అందరినీ ఆశ్చర్య పరిచారు. కారోబార్ సంఘం, ఎపీఓవోలు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, కేజీ బీవీ స్పెషల్ ఆఫీసర్లు హరీష్ రావుకు పలు డిమాండ్లతో కూడిన వినతపత్రాలు అందజేశారు.

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోకండి

చెన్నూర్ : కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు నమ్మి మోసపోతే తర్వాత గోస పడుతారు అని చెన్నూరు పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. ఈ సందర్భంగా చెన్నూరు పట్టణంలో పది కోట్లతో నిర్మించిన యాభై పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించి, యాభై ఐదు కోట్లతో పలు అభివద్ధి కార్యక్రమాలకు విప్ బాల్క సుమన్, ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, ఎమ్మెల్సీ దండే విఠల్ తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం చెన్నూరు అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు.



చెన్నూర్ : ఆస్పత్రి శిలాపలకాన్ని ఆవిష్కరించిన మంత్రి హరీష్ రావు, ప్రభుత్వ విప్ బాల్కసుమన్

బీజేపీ ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడి ఎన్నిక



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

బీజేపీ ఎస్సీ మోర్చ పట్టణ అధ్యక్షుడిగా మాసు మహేందర్ నియమితులయ్యారు. శనివారం స్థానిక గద్దరాగడిలో గల ఎస్సీ మోర్చా జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పత్తి శ్రీనివాస్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. అనంతరం పత్తి శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో చెన్నూర్‌లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని, బడుగు బలహీన వర్గాల బతుకులు బాగు పడాలంటే అది ప్రధాని నరేంద్ర మోడి నేతృత్వంలో సాధ్యమని అన్నారు. రాష్ట్రంలో దేశంలో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిలా పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు వైద్య శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మాసూ సత్యనారాయణ, మందమర్రి రూరల్ అధ్యక్షులు మెడ మల్లేష్, బూత్ అధ్యక్షులు బైర మల్లేష్, బోయిన్ జగదీశ్వర్, దుర్గం రాజ శేఖర్, ఉర్సు నర్సయ్య పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం



నవతెలంగాణ-జన్నారం

క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని జన్నారం మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు, తిమ్మాపూర్ సర్పంచ్ జాడి గంగాధర్ అన్నారు. శనివారం తిమ్మాపూర్ గ్రామపంచాయతీలో ప్రభుత్వం ద్వారా యువకులకు అందించే క్రికెట్, వాలీబాల్ స్కిప్పింగ్ టెన్నిస్, ఇతర ఆట వస్తువులను అందించారు. యువకులు క్రీడలలో రాణించి రాష్ట్రంలో దేశంలో బహుమతులు పొందాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి లావణ్య, ఉప సర్పంచ్ ఆసునూరి పద్మ, అవార్డు సభ్యులు చంద్రయ్య భూమన్న, వెంకట్, రాజన్న, లక్ష్మి సాదం చిన్నన్న గుగులావత్ రవి, శంకర్ గంగాధర్ నరేష్, జునుగురు మల్లేష్ రేగుంట ప్రదీప్, శివాజీ నరేష్ పాల్గొన్నారు.

కవ్వాల్ టైగర్ జోన్‌లో పక్షి గణన



నవతెలంగాణ-జన్నారం

69వ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో వన్యప్రాణుల సంరక్షణకు పక్షుల వీక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఎఫ్‌డీఓ మాధవరావు తెలిపారు. ఈ సందర్భంగా అటవీ శాఖ సిబ్బంది ఎఫ్‌సీఆర్ఐ విద్యార్థులు, పక్షి ప్రేమికులు ఈ కార్యక్రమంలో పాల్గొని పక్షులను వీక్షించారు.. ఈ కార్యక్రమంలో బాగంగా ఉదయం 6.00 గంటలకు ట్రైసన్ కుంట వద్దకు చేరుకొని పక్షుల వీక్షణ, వాటి గణన చేపట్టారు. సుమారు 50కి పైగా పక్షలను గుర్తించారు. ఇందులో ముఖ్యంగా గ్రే హెడెడ్ ఫిష్ ఈగల్, కింగ్ ఫిషర్స్, పారాకీట్స్, బాతులు, బీ ఈటర్, హాక్ ఈగల్, హేరాన్స్ మొదలైన పక్షులు ఉన్నాయన్నారు. ఆ తరువాత పక్షుల ఆవాసాల సంరక్షణ వాటి సంతతి పెంపుదల, నీటి సదుపాయం, వేటగాళ్లనుండి రక్షణ మొదలైన అంశాల, అటవీ అధికారులకు ములుగు ఎఫ్‌సీఆర్ఎల్ విద్యార్థులకు వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ సిబ్బంది ఎఫ్ సి ఆర్ ఎల్ ములుగు కళాశాల విద్యార్థులు, ఇతర పక్షి ప్రేమికులు పాల్గొన్నారు.

'కులాలను విభజించి రాజకీయం చేయొద్దు'

నవతెలంగాణ-జన్నారం

కులాల మతాల మధ్య చిచ్చు పెడుతూ, రాజకీయాలు చేయడం ఎమ్మెల్సీ దండే విట్టల్‌కు తగదని బీసీ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ కాసెట్టి లక్ష్మణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన పత్రిక విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ, దండే విటల్ మున్నూరు కాపు, ఒక కులాన్ని, మాత్రమే ఎత్తుకొని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను, మతాలను విభజిస్తూ రాజకీయాలు చేయడం తగదన్నారు. ఇది బీఆర్ఎస్ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌కు తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పునర్ ఆలోచించాలన్నారు. దండే విఠల్‌ను ఖానాపూర్ నియోజకవర్గంకు రాకుండా చూడాలన్నారు. దండ విఠల్ హటావో ఖానాపూర్ బచావో అని నినాదాలు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘ సభ్యులకు గానీ దండే విఠల్‌కు గాని ఎలాంటి సంబంధం లేదన్నారు. మండలానికి వచ్చి మున్నూరు కాపులపై పెత్తనం చెలాయించడం తగదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోట్ల రాజేష్ యాదవ్, నాయకులు లెక్కల మల్లయ్య, శ్రీకాంత్ రెడ్డి, కాసెట్టి రాజన్న, కాసెట్టి వెంకన్న, ఎంబడిసత్యన్నా, దాసరిరాజన్న, భూమన్న, అల్లం రవి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ



నవతెలంగాణ-తాండూర్

సమ్మె విరమించిన అంగన్‌వాడీలు కేంద్రాలలో పౌష్టికాహార పంపిణీ ప్రారంభించారు. శనివారం ఎన్టీఆర్ కాలనీ మాదారం తాండూర్ కేంద్రాలలో పౌష్టికాహార పంపిణీ చేశారు. గర్భిణీలు బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. సోమవారం నుంచి ప్రీస్కూల్ నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు.

బతుకమ్మ చీరల పంపిణీ

నవతెలంగాణ-జన్నారం

ఆడపడుచులకు బతుకమ్మ పండగ కానుకగా రాష్ట్ర ప్రభుత్వం చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని, జన్నారం మండలం ధర్మారం గ్రామ సర్పంచ్ దుర్గం గంగాధర్ అన్నారు. శనివారం ప్రభుత్వం ద్వారా అందించే బతుకమ్మ చీరలను ఆ గ్రామంలోని మహిళలకు పంపిణీ చేశారు. అలాగే తిమ్మాపూర్ గ్రామంలో బతుకమ్మ చీరలను ఆ గ్రామ సర్పంచ్ జాడి గంగాధర్ మహిళలకు పంపిణీ చేసి బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.

న్యాయవాది పరిషత్ సమావేశంలో జిల్లా న్యాయవాదులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని మారుతి ఫంక్షన్ హాల్‌లో నిర్మల్ పరిషత్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర న్యాయవాది పరిషత్ సమావేశంలో జిల్లా న్యాయవాదులు పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి లక్ష్మణ్ సురేపల్లి నందలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమూర్తులు కేసులకు సంబంధించిన వాదించాల్సిన అంశాలను తెలియజేయడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయవాదులు జుమ్మిడి రాజేష్ జాదవ్, ఆకాష్, నరహరి, నాగరాజు పాల్గొన్నారు.

బాదిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఆసిఫాబాద్ : బీఆర్ఎస్ నాయకుడు శైలేందర్ తండ్రి వెంకటేశం కొద్దిరోజుల క్రితం మరణించగా ఎమ్మెల్యే ఆత్రం సక్కు జిల్లా కేంద్రంలోని ఆయన ఇంటికి వెళ్లి నాయకులతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మెన్ అలీబిన్ అహ్మద్, సర్పంచులు భీమేష్, బాబురావు, లైన్స్ క్లబ్ సభ్యుడు కోట వెంకన్న పాల్గొన్నారు.

యూరియా లేక రైతులకు ఇబ్బందులు



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారిణి

నవతెలంగాణ-జన్నారం

మండలంలో యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తపాలాపూర్ గ్రామ సర్పంచ్ నైనాల తిరుపతి మండల వ్యవసాయ శాఖ అధికారి సంగీతను నిలదీశారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశం మందిరంలో ఎంపీపీ మాదాడి సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పీఎసీఎస్, ప్రభుత్వ, ప్రయివేటు ఫర్టిలైజర్ దుఖాణాలలో యూరియా లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. చివరి దశలో యూరియా లేకపోతే రైతులు ఆ పంటలు సరిగా పండే అవకాశం లేదని వ్యవసాయ శాఖ అధికారుల నిలదీశారు. స్పందించిన ఏఓ సంగీత యూరియా రైతులకు అందుబాటులోనే ఉందని ఇంకా కావలసి ఉంటే త్వరలోనే తెప్పిస్తామని సర్పంచ్‌కు సమాధానం ఇచ్చారు. బీసీ బందు అర్హులకు కాకుండా అనరులకు ఇచ్చారని అది ఎవరికి ఇచ్చారో పూర్తి, లిస్టును బయట పెట్టాలని ధర్మారం సర్పంచ్ దుర్గం గంగాధర్ అధికారులను నిలదీశారు. విద్యా వైద్యంపై ఆయా శాఖల అధికారులు వారి నివేదికలను చదివి వినిపించారు. పాడి పశువులలో ఆవులు గేదెలలో ఉచితంగా గాలికుంటు, నట్టల నివారణ మందులను లాంటి స్కిన్ వ్యాధి నివారణ టీకాలను అందించడం జరిగిందని మండల పశువైద్యాధికారి డాక్టర్ కస్తూరి శ్రీకాంత్ తెలిపారు. రెండవ విడత గొర్రెల పంపిణీ పథకం ద్వారా మండలంలో ఇప్పటివరకు 48 మంది గొర్రెల కాపరులకు గొర్రెల యూనిట్లను అందించడం జరిగిందన్నారు. మిగిలిన గొర్రెల కాపరులకు త్వరలోనే గొర్రెల పంపిణీ చేపడతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాదాడి సరోజన రవీందర్రావు జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, తహసీల్దార్ వనజా రెడ్డి, ఎంపీడీఓ అరుణ రాణి పాల్గొన్నారు.

అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యత



నవతెలంగాణ-మందమర్రి

మనుషుల అక్రమ రవాణాను నిరోధించడం అందరి బాధ్యతని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ కోఆర్డినేటర్ సురేష్ కుమార్ అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ మహిళా శిశు సంక్షేమ శాఖ మంచిర్యాల ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మనుషుల అక్రమ రవాణాపైన 2 రోజుల శిక్షణను శనివారం మందమర్రి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రజ్వల సీనియర్ కోఆర్డినేటర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ అక్రమ రవాణా అనేది ప్రపంచం లోనే అతి పెద్ద నేరమని, ఎంతో మంది అమ్మాయిలు రోజూ దీనికి గురవుతున్నారని అన్నారు. ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, పాఠశాల కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు అంగన్‌వాడీ టీచర్లు తమ విద్యార్థులకు, మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. అక్రమ రవాణాకు లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ గత 27 సంవత్సరాలుగా పద్మశ్రీ డా సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో సంబంధిత మహిళా శిషు సంక్షేమ శాఖ, పోలీస్, విద్యా శాఖ, న్యాయ శాఖల సమన్వయముతో ఇప్పటి వరకు 28200 మంది అమ్మాయిలను మహిళలను కాపాడి వారికీ పునరావాసం కల్పించామని తెలిపారు. అక్రమ రవాణాను అరికట్టడంలో అందరు భాగస్వామ్యం కావాలని ప్రతి గ్రామ వార్డులలో సమాజ జాగృతి సంఘాలను ఏర్పాటు చేయడం ద్వారా అందరు అప్రమతంగా ఉంటారని అన్నారు. ఈ శిక్షణలో టీచర్లకు లఘు చిత్రాలు, బృంద చర్చల స్కిట్ ప్లేల ద్వారా శిక్షణనిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్ శివ కుమార్, మంచిర్యాల ప్రాజెక్ట్ సెక్టార్ సూపర్ వైజర్‌లు సరిత, సంధ్య రాణి, స్వరూప, రమాదేవి పాల్గొన్నారు.

కలమడుగు గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-జన్నారం

అన్ని రకాల వసతులు ఉన్న జనాభాపరంగా విస్తీర్ణంలోనూ పెద్దగా ఉన్న కలమడుగు గ్రామపంచాయతీని మండలంగా ఏర్పాటు చేయాలని కలమాడుగు గ్రామపంచాయతీలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామపంచాయతీని మండలంగా ఏర్పాటు చేసే వరకు మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కమిటీ సభ్యులు ఐక్యమత్యంగా అన్ని గ్రామపంచాయతీలలో పర్యటిస్తూ అందరిని వినతులు చేస్తూ మండలం గురించి వివరిస్తూ అందరిని ఏకతాటిపైకి తీసుకురావాలని, ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల సాధన కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ యాదగిరి, కార్యక్రమంలో స్వదేశీ రావు జాడిశంకర్, ఉపసర్పంచ్ రాజు గౌడ్, బండ దేవేందర్, పాత బాలరాజు, బొంతల మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | అక్టోబర్ 08, 2023 | www.navatelangana.com

భోజనం వికటించి పలువురికి అస్వస్థత

● మెండాపల్లిలో ఘటన ● రిమ్స్‌కు తరలింపు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని మెండాపల్లి గ్రామంలో భోజనం వికటించి వంద మంది వరకు అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలోని బడే బల్వంత్ ఇంటి వద్ద శుక్రవారం పితృమాస సందర్భంగా గ్రామస్తులకు భోజనం ఏర్పాటు చేశారు. భోజనం తిన్న తరువాత రాత్రి నుంచి ఒకొక్కరు వాంతులు, కడుపు నొప్పి, విరేచనాలతో బాధపడుతూ ఆస్పత్రికి వెళ్లారు. పీహెచ్‌సీతో పాటు ప్రయివేట్ అస్పత్రిలో ప్రథమ చికిత్స పొందిన అనంతరం మెరుగైన వైద్యానికి కొందరిని ఆదిలాబాద్ రిమ్స్, నిర్మల్‌కు తరలించారు. శనివారం రోజు ఉర్మిల(52), లలిత(32), ఆశ(37), దిగాంబర్ (65), రేవతి(48), కంచన్ (35), జ్యోతి(34), రుషికేశ్ (11) అస్వస్థతకు గురికాగా సుమారు 36 మందిని పీహెచ్‌సీకి తరలించారు. ఇందులో చిన్న పిల్లలకు మెరుగైన వైద్యం కోసం నిర్మల్‌కు తరలించారు. స్థానిక వైద్యుడు శ్రీకాంత్ గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల విడుదలైన కానిస్టేబుల్ ఫలితాల్లో ఆదిలాబాద్ కబడ్డీ అసోసియేషన్, మాస్టర్ డిఫెన్స్ అకాడమీ నుండి 42 మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు. అభ్యర్థులకు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ శనివారం వారి నివాసంలో శాలువతో సత్కరించి అభినందించారు. ఉద్యోగాల కోసం పోటీ పడే విద్యార్థులకు 10 ఎకరాలలో ట్రైనింగ్ ఇచ్చి వేల మంది అభ్యర్థులను ప్రభుత్వ ఉద్యోగాలలో చూడాలని తన కోరికని అన్నారు. ప్రస్తుతం ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు తరువాత వచ్చే పోటీ దారులకు స్ఫూర్తిగా నిలబడి వారికి అన్ని విధాలుగా అండగా ఉండి సూచనలు అందించాలన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి రాష్ట్రపాల్, ఉపాధ్యక్షులు విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.



కంపోజిట్ సిలిండర్‌పై అవగాహన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఇండియన్ గ్యాస్ ప్రవేశపెట్టిన పది కేజీల కంపోజిట్ గ్యాస్ సిలిండర్‌పై శనివారం గ్యాస్ వినియోగదారులకు అవగాహన కల్పించారు. స్థానిక స్టేట్ బ్యాంక్ ముందు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవగాహన కల్పించారు. తేలికంగా ఉండే కంపోజిట్ పది కేజీల సిలిండర్ ఇంట్లో మహిళలకు సౌకర్యంగా ఉంటుందని, ఒక ప్రాంతం నుండి వేరే ప్రాంతానికి సులువుగా తరలించే అవకాశం ఉండడం, లీకేజీ సమస్య ఉండదని వివరించారు. ఈ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ మిట్ట మహేష్, స్థానిక ఏజెన్సీ ప్రతినిధి పాల్వాయి కిషన్‌రావు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు త్రీఫేజ్ కరెంటు



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని గుట్టమీద గల గిరిజన గ్రామాలు పల్సి-బి, తాండ, పల్సి-కే, దేగామ, కోసాయి గ్రామాల రైతులకు త్రీఫేస్ కరెంట్ సౌకర్యం కల్పించారు. శనివారం గ్రామాలకు స్తంభాలు, టాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. గిరిజన రైతుల సాగు చేయడానికి పడుతున్న ఇబ్బందులను జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి విన్నవించడంతో ట్రైబల్ ఎస్‌డీఎఫ్ స్కీంలో వీటిని మంజూరు చేశారు. కాగా విద్యుత్ శాఖ సహకారంతో 60 మంది రైతులకు 780 పోల్స్ వేసి పది ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ట్రైనీ కలెక్టర్ వికాస్ మోహతో, జడ్పీటీసీ గణేష్ రెడ్డి ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డీఈ ప్రభకర్, ఏఈలు శ్రీనివాస్, సతీష్, సర్పంచులు పాయల్ అంగూర్, సరోజ, గోపాల్, సుభాష్, ఎంపీటీసీలు హనుమంతు, వెంకన్న యాదవ్, రమేష్ రెడ్డి, అశోక్ రెడ్డి, పెందూరు మాధవరావు పాల్గొన్నారు.

రైతుల ఇబ్బందులు తెలిసిన వ్యక్తి కేసీఆర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతుల ఇబ్బందులు పేద కుటుంబాల పరిస్థితులు పూర్తిగా తెలిసిన వ్యక్తి సీఎం కేసీఆర్ అని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్బన్, మావల, రూరల్‌కు చెందిన 148 కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డ కుటుంబం దళారుల వద్ద అప్పులపాలు కావద్దని సీఎం కేసీఆర్ రూ.లక్ష వెయ్యి 16 అందజేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. రైతు బంధు, కల్యాణ లక్ష్మి, షాదిముబారక్, అమ్మఒడి, అల్పాహార పథకం యావత్ తెలంగాణ ప్రజానీకానికి అండగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ జీహెచ్ రంజాని, పట్టణ అధ్యక్షులు అజయ్, అశ్రఫ్, ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, కౌన్సిలర్లు అశోక్ స్వామి, పందిరి భూమన్న, సలీం, ఇమ్రాన్, కోఆప్షన్ ఏజాజ్, సాజిదొద్దీన్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్‌కు మూడో బహుమతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఆర్టీసీలో శ్రావణమాసం ఛాలెంజ్‌లో భాగంగా ఆదిలాబాద్ రీజియన్‌కు రాష్ట్ర వ్యాప్తంగా మూడవ బహుమతి లభించినట్లు ఆర్ఎం సోలేమాన్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతులు మీదుగా బహుమతితో పాటు రూ.50వేల నగదు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈడీ వినోద్ కుమార్, డిప్యూటీ ఆర్ఎం సురేష్ చౌహాన్, డిపో మేనేజర్లు కల్పన, ప్రతిమ శ్రీధర్ ఉన్నారు.


ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని డీఎస్సీ టీచర్ ఉద్యోగాలకు సన్నద్ధం అవుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు డీఎస్సీ ఎస్జీటీ టీచర్ ఉద్యోగాల కోసం బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో శిక్షణ తీసుకునేందుకు 100 మందికి అవకాశం ఉందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 8 నుండి 12వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ ధృవపత్రాలతో బీసీ స్టడీ సర్కిల్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణకు బీసీలకు 75, ఎస్సీలకు 15, ఎస్టీలకు 5, ఈబీసీలకు 5శాతం అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 08732-221280ను సంప్రదించాలని సూచించారు.

ముగ్గురిలో టికెట్ ఎవరికిచ్చినా సై అంటున్న నాయకులు

● కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా ● నవతెలంగాణతో కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుటుంబ పాలనలో, ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే జోగు రామన్న కుటుంబ పాలనలో రాష్ట్ర, జిల్లా ప్రజలకు ఒరిగిందేమీ లేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రతి పేద వాడికి లబ్ది చేకూరేలా, ప్రతి పేదవాడి కుటుంబం అభివృద్ధి చెందేవిదంగా చేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవ్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా నవతెలంగాణతో వారు మాట్లాడారు. రాష్ట్రంలో, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలపడిందని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అటు రాష్ట్రంలో, జిల్లాలో మెజార్టీ సీట్లు గెల్చుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి కేబినెట్ సమావేశంలో ఆమోదించి 100 రోజుల్లో కాంగ్రెస్ గ్యారంటీ కార్డులను అమలు చేసి తీరుతామన్నారు.

యువతను మోసం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి నేటికి 9 ఏండ్లు పూర్తి చేసుకొని పదవ సంవత్సరంలోకి అడుగు పెడుతున్నాం కానీ రాష్ట్ర, జిల్లా ప్రజల ఆకాంక్షలు, సమస్యలు, కోరికలు ఇప్పటీవరకు ఏమీ నెరవేరలేదన్నారు. ఈ తొమ్మిదేండ్లలో రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబ, నియోజకవర్గంలో జోగు కుటుంబం మాత్రమే అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణ ఏర్పడ్డక నిరుద్యోగత పెరిగింది కానీ తగ్గలేదు. 58 సంవత్సరాలకు ఉద్యోగ విరమణ వయస్సును 61కు పెంచి నిరుద్యోగులకు నష్టం చేశారు. తెలంగాణ ఇచ్చింది, వచ్చింది కాంగ్రెస్ సోనియాగాంధీ వల్లనేనని తెలిపారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి యువతను మోసం చేశారు. విద్యారంగంలో అనేక సమస్యలు నెలకొన్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు, వసతి గృహాల్లో మౌలిక సౌకర్యాలు ఏమీ లేవు. తెలంగాణను తాగుబోతు, నిరుద్యోగ తెలంగాణగా మార్చారు. కేసీఆర్ కుటుంబంలో కొడుకు, అల్లుడు మంత్రి అయ్యాడు. కూతురు ఎమ్మెల్సీ అయింది. కేవలం వారి కుటుంబమే అభివృద్ధి అయింది వారే దోచుకుతింటున్నారు. తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదు. మిషన్ భగీరథ కార్యక్రమం పూర్తిగా విఫలమైంది. సమస్యలు, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటే ఆందోళనలు, నిరసనలు, రోడ్డు మీద ధర్నాలు చేస్తే కానీ ప్రభుత్వం స్పందించడం లేదు. రైతులు విత్తనం నాటిన దగ్గర నుండి పంట చేతికొచ్చి, అమ్మే వరకు అడుగడుగునా సమస్యలు ఎదురవుతున్నాయి. పంట వేయాలన్న, అమ్మాలన్న కష్టంగానే ఉంది. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీలో విద్యార్థులకు తీవ్రంగా నష్టం వాటిల్లింది.

జోగు చేసిన అభివృద్ధి ఏమీ లేదు

ఆదిలాబాద్ జిల్లాలో ప్రజలు, రైతు, ఆదివాసుల సమస్యలు ఏవి కూడా నెరవేరలేదు. స్థానిక ఎమ్మెల్యే జోగురామన్న జిల్లాను దోచుకుతింటున్నాడు. మంత్రిగా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఏమీ చేయలేదు. తన కొడుకును మున్సిపల్ చైర్మన్ చేశాడు. మరో కుమారుడు భూ కబ్జాలు చేస్తున్నాడు. ముగ్గురు జోగు కుటుంబం కలిసి ఆదిలాబాద్‌ను దోచేస్తున్నారు. ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్ట్ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. బోథ్ కుప్టి ప్రాజెక్టు నిర్మిస్తామని చెప్పి ఇప్పటికి నిర్మించలేదు. పేద, గిరిజన విద్యార్థులకు గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయడంతో విఫలమైంది. సిమెంట్ ఫ్యాక్టరీ ఓపెనింగ్ కాలేదు, ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటు కాలేదు. రూ. వందల కోట్లు ఖర్చు పెట్టి రిమ్స్ సూపర్ స్పెషాలిటీ నిర్మించారు కానీ వైద్యులు లేక పేరుకే పెద్దాస్పత్రిగా, అందని ద్రాక్షగా వైద్యం అయ్యింది. రిమ్స్‌లో ఉద్యోగాల పేరిట అక్రమాలు జరుగుతున్నాయి. ఆదిలాబాద్ మున్సిపాలిటిలో అయితే అడుగడుగునా అవినీతే. పట్టణ సుందరీకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. నాణ్యత లేని నిర్మాణాలు చేపడుతున్నారు. పలు కూడళ్లలో పెచ్చులు ఉడిపోవడం, రాత్రి వేళల్లో సరిగ్గా లైట్లు వెలగకపోవడం, ఆదిలాబాద్ రూరల్ మండలంలోని రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ పేరు మీద రైతుల నుండి భూములు తీసుకొని రైతులను మోసం చేశారు. రైతులకు న్యాయం చేయలేద... అక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయలేదు. ఈ తొమ్మిదేండ్ల పాలనలో అధికార పార్టీ నాయకులు దోచుకుతిన్నారు తప్ప, ప్రజల సమస్యలు నెరవేర్చలేదు. పోడు భూములకు పట్టాలు ఇస్తామన్నారు. అడిగితే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు. ఈ పాలనకు చరమగీతం పాడాలి, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది.

కందికి టికెట్ ఇస్తే మేం సపోర్ట్ చేయం..!

ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్ తమ ముగ్గురిలో ఎవరికిచ్చిన తాము గెలిపించుకుంటామని, ఒకరికొకరు సపోర్ట్ చేసుకుంటామని స్పష్టం చేశారు. అయితే తమని కాదని ఇతరులకు ప్యారాషూట్ లీడర్, ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగి ఉన్న కంది శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఇవ్వొద్దని, ఆయనకు టికెట్ ఇస్తే పార్టీ గెలుపుకు కృషి చేయమంటూ తేల్చి చెప్పారు. ఎంతో కాలంగా పార్టీ జెండా మోసి, పార్టీ బలోపేతానికి కృషి చేసిన వారికి టికెట్ ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నట్టు తెలిపారు.

జెడ్పీ వైస్ చైర్మన్‌కు భోజన కార్మికుల వినతి



ర్యాలీగా వెళుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మధ్యాహ్న భోజన కార్మికులు శనివారం జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణకు వినతిపత్రం అందించారు. ముందుగా కార్మికులు కాగజ్‌నగర్‌లోని బాలభారతి ఉన్నత పాఠశాల నుండి ర్యాలీగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం చేరుకున్నారు. అనంతరం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ కార్మికులకు పెరిగిన వేతనాల చెల్లింపు బడ్జెట్ వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని, కొత్త మెనూకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని, పాత మెనూనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శారద, కార్మికులు రూప, ఎర్ర కాంత, బుజ్జమ్మ, పద్మ, బాయమ్మ, పద్మ, శ్రీలత పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయం ముట్టడి

కాగజ్‌నగర్ మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికులు శనివారం ఎంఈఓ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ముంజం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ. 15 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సుమారు రెండు గంటల పాటు కార్యాలయాన్ని దిగ్బంధం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం) నాయకులు సాయికృష్ణ, కార్మికులు శ్యామలి, తారాబాయి, లక్ష్మి, అంజలి, ఆశ పాల్గొన్నారు.

కాసిపేట : ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా 2022లో మధ్యాహ్న భోజనం కార్మికుల వేతనాలు పెంచుతున్నామని గొప్పగా చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఇప్పటి వరకు పెంచలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భోజన కార్మికుల డిమాండ్ల పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో బుచ్చవ్వ, లక్ష్మి, వాణి పాల్గొన్నారు.

ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలి

● కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రానున్న అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణ విధులపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలన్నారు. ఎన్నికల కోడ్ అమలై తిరిగి ముగిసే వరకు ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గనిర్దేశాలను క్షుణ్ణంగా చదివి, అవగాహన కలిగి ఉండాలని అధికారులకు సూచించారు. ఎన్నికల కోడ్ అమలైన 24 గంటలలో ప్రభుత్వ కార్యాలయాలు, కార్పొరేషన్లు, పబ్లిక్ పార్కులు, బస్, రైల్వే స్టేషన్, పట్టణ, మండల, గ్రామీణ ప్రాంతాలలో కేంద్ర, రాష్ట్ర రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, పోస్టర్స్, హోర్డింగ్స్, వాల్ పెయింటింగ్స్ తొలగించాలని ఆదేశించారు. శాఖల వారిగా పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తిచేయాలన్నారు. ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని, విధులపై నిర్లక్ష్యం వహించిన వారిపై ఎన్నికల కమిషన్ నిబంధన మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సరిహద్దుల్లోని చెక్ పోస్టులలో 24 గంటల పాటు పర్యవేక్షణ చేపట్టేందుకు సిబ్బందిని నియమించామన్నారు. పోలీస్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అక్రమంగా మద్యం, నగదు, డ్రగ్స్, గాంజయి వంటి మత్తు పదార్థాలు తరలించకుండా పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్లు ఖుష్బు గుప్త, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, ఇన్‌చార్జి డీఆర్ఓ రమేష్ రాథోడ్, ఆర్డీఓ స్రవంతి, పోలీసు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్‌గా ఉద్యోగాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ అలాగే ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐడీ కళాశాల ప్రిన్సిపాల్ ఏ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైన్స్ కళాశాలలో జువాలజీ -2, బోటనీ- 1, ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలలో హిస్టరీ- 1, కామర్స్ -2, చొప్పున ఖాళీలు ఉన్నాయని తెలిపారు. పీజీలో సంబంధిత సబ్జెక్టులలో 55% మార్కులు, ఎస్సీ, ఎస్టీ వారు 50% మార్కులు కలిగి ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత ఉన్నవారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. బోధన అనుభవం ఉన్నవారికి అదనపు అర్హతగా పరిగణిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 9న సంబంధిత ధృవపత్రాలతో సైన్స్ కళాశాలలో డెమో పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

రేపు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని దస్నాపూర్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను 9న నిర్వహిస్తున్నట్లు డీఈ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ టౌన్ సబ్ డివిజన్ వినియోగదారులు ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని కోరారు. సమయం ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 1: 00 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ నార్త్, సౌత్, టౌన్ 3, రూరల్ మావల సెక్షన్ వినియోగదారులు పాల్గొనాలని సూచించారు.

అమిత్‌షా సీసీఐ ప్రారంభంపై ప్రకటన చేయాలి

● సీసీఐ సాధన కమిటీ సమావేశం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 10న జిల్లాకు రానున్న కేంద్ర హోం శాఖ మంత్రి సీసీఐ పున:ప్రారంభంపై ప్రకటన చేయాలని సీసీఐ సాధన కమిటీ కన్వీనర్ దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం సాధన కమిటీ సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ మాట్లాడుతూ అక్టోబర్ 10న జిల్లాకు వస్తున్న కేంద్ర హోం శాఖ మంత్రి తన సభలో సీసీఐ పున:ప్రారంభానికి ప్రకటన చేయాలన్నారు. ఇదే విషయంలో అమిత్ షాను కలిసి వినతిపత్రం అందించేల అవకాశం కల్పించాలని ఎంపీ సోయం బాపూరావును, బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్‌లను కోరగా సానుకూలంగానే స్పందించినట్లు తెలిపారు. సీసీఐ పున:ప్రారభం అనేది జిల్లా ప్రజల చిరకాల కోరిక అని అందుకోసం పార్టీలకు అతీతంగా సీసీఐ సాధన కమిటీ ఏర్పడిందన్నారు. రెండేండ్లుగా పోరాడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. అమిత్ షా సభలో సీసీఐ పున:ప్రారంభానికి చర్యలు తీసుకుంటే జిల్లా ప్రజలు హర్షిస్తారన్నారు. ఈ సమావేశంలో సాధన కమిటీ కో కన్వీనర్ విజ్జగిరి నారాయణ, కొండా రమేష్, ఏ.అరవింద్, నంది రామయ్య, నాయకులు బండి దత్రాత్రి, ఈశ్వర్ దాస్, రాజన్న పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో రక్షణ చట్టాలపై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులు రక్షణ చట్టాలపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. దీనికి జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు జడ్జి శామ్యూల్, జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామల దేవిలు ముఖ్య అతిథులుగా హాజరై వినియోగదారుల హక్కులు రక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చట్టాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ అనిత, జిల్లా వినియోగదారుల సహాయ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శంకరల్ లాల్ చౌరాసియా, ఉపాధ్యక్షులు సంపత్ కుమార్, వినియోగదారుల సంఘం అధ్యక్షులు సత్యనారాయణ, ఉమ్మడి జిల్లా వినియోగదారుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు మోహన్, కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ ఉన్నారు.

యూనివర్సిటీ అనుబంధ క్యాంపస్‌ను ఉట్నూర్‌లో ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

ఏజెన్సీ కేంద్రమైన ఉట్నూర్‌లో గిరిజన యూనివర్సిటీ అనుబంద క్యాంపస్ ఏర్పాటు చేయాలని జనసేన పార్టీ ఖానాపూర్ ఇన్‌చార్జి డాక్టర్ ధారావత్ నరేందర్ నాయక్ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజనులకు పీజీ విద్య అందడం లేదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రావాల్సిన యూనివర్సిటీని ములుగులో ఏర్పాటు చేయడం ఏంటాని ప్రశ్నించారు. ఇక్కడ పేదరికంలో ఉన్న గిరిజనులు ఉన్నత చదువులకు హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ లాంటి ప్రాంతాలకు వెళ్లలేక చదువుకు దూరం అవుతున్నారన్నారు. యూనివర్సిటీలు ఉన్న చోట గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే గిరిజనులకు ఉన్నత విద్య ఎలా అందుతుందన్నారు. ఉట్నూర్ కేంద్రంగా ఎంబీబీఎస్ కళాశాల, గిరిజన యూనివర్సిటీ అనుబంధ క్యాంపస్ ఏర్పాటు చేసి గిరిజనులకు ఉన్నత విద్యను అందించాలన్నారు. ఏజెన్సీలో జీఓ నెంబర్ 3ని పునరుద్దరించి గిరిజన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని 32 నియోజకవర్గాల్లో జనసేన పోటీ చేయనుందన్నారు. ఈ సమావేశంలో నాయకులు మేడి శ్రీనాథ్, నరేష్, వినిత్, శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రావణ్, రవి, ప్రశాంత్, అరుణ్, క్రాంతి పాల్గొన్నారు.

అగ్నిపథ్‌లో ఉద్యోగం పొందిన జవాన్‌కు ఘన స్వాగతం

నవతెలంగాణ-నార్నూర్

గాదిగూడ మండలంలోని లోకారి(కే) గ్రామానికి చెందిన మాడవి రాజ్ కుమార్ అగ్నిపథ్‌లో చోటు సాధించాడు. శిక్షణ పూర్తి చేసుకోని వచ్చిన ఆయనకు శనివారం గ్రామ సర్పంచ్ సర్పంచ్, ప్రజలు, కుమురం భీం యూత్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఆర్మీ జవాన్‌కు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మెస్రం దేవ్‌రావ్ మాట్లాడుతూ గ్రామంలో మొట్టమొదటి సారిగా ఆర్మీ జవాన్‌గా ఉద్యోగం పొందిన మాడావి రాజ్ కుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

